సూర్య 18వ వసంతంలోకి ...
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
మంగళవారం | 27 మే 2025 | విజయవాడ
సంపుటి 18 | సంచిక 214
| పేజీలు 8+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...


APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర బహుళ అమావాస్య ఉ.8.56, కృత్తిక ఉ.6.00 వర్జ్యం రా.9.04 నుంచి 10.34 వరకు
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు దుర్ముహూర్తం ఉ.8.08 నుంచి 9.58 వరకు తిరిగి రా.10.48 నుంచి 11.33 వరకు

## కడపలో నేటి నుండి
# పసుపు పండగ

### పసుపుదళానికి నూతనోత్తేజం!


3లో

తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2024 ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అనంతరం జరుగుతున్న కడప మహానాడును అంగరంగ వైభవంగా నిర్వహించుకునేందుకు ఆ పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఉమ్మడి కడపలోని 10 అసెంబ్లీ సీట్లలో 7 స్థానాలను టీడీపీ వైవశం చేసుకుంది. ఈ క్రమంలో మహానాడు ను చారిత్రాత్మకంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. ఈనెల 27,28,29 తేదీలలో కడప నగర సమీపంలోని కమలాపురం నియోజకవర్గం లోని పబ్బాపురంలో మహానాడు ను నిర్వహించేందుకు టీడీపీ అధిష్టానం నిర్ణయించింది.

- కడప మహానాడుకు సర్వం సిద్ధం
- 135 ఎకరాల్లో మహానాడు ప్రాంగణం, 3 వేల ఎకరాల పార్కింగ్
- 23,500 మంది పార్టీ ప్రతినిధుల సభ
- మొదటి రోజు సంస్థాగత నిర్మాణం, పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతలు దిశానిర్దేశం
- రెండో రోజు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై సమగ్రంగా చర్చ
- మూడవ రోజు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ
- కడపకు చేరుకున్న జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్
- నేడు కడపకు రానున్న అధినేత, సీఎం చంద్రబాబు

### వచ్చే నెల 4న ఏపీ కేబినెట్ భేటీ


2లో

ఏపీ కేబినెట్ భేటీ ముహూర్తం ఖరారైంది. వచ్చే నెల 4న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రత్యేకంగా చర్చించనున్నారు.

### వైఎస్సార్ కడప ఓకే

- ఎన్టీఆర్ విజయవాడ ఎప్పుడు ?..
- షర్మిల ప్రశ్న..!


2లో

ఏపీలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా సంస్థల పేర్లు మార్చడం సర్వసాధారణంగా జరుగుతున్నదే.

## లాభాల్లో స్టాక్
# మార్కెట్‌లు


5లో

- ఐటీ, ఆటో షేర్ల దన్ను!
- వరుసగా రెండో రోజూ లాభాల పంట
- సెన్సెక్స్ 455 పాయింట్లు, నిఫ్టీ 148 పాయింట్లు వృద్ధి
- కీలకమైన 25 వేల మార్కును దాటిన నిఫ్టీ

## 31 వరకు భారీ
# వర్షాలు



- ముంబయి, ఢిల్లీని ముంచెత్తిన వానలు
- కొన్ని రాష్ట్రాల్లో స్కూల్స్ బంద్
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

వివరాలు-6లో

## మరోసారి కరోనా పంజా


6లో

- మళ్లీ ప్రజలలో మొదలైన కలవరం
- ఢిల్లీలో 104 క్రియాశీల కేసులు..
- 400పైగా కేసులతో మొదటి స్థానంలో కేరళ
- ఆసియా దేశాలలోనూ నమోదవుతున్న కేసులు

## పాక్ ఏకైక లక్ష్యం భారత్‌తో
# శత్రుత్వమే

### మన త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చాం

- ప్రపంచం చూడని విధంగా అద్భుతాలు సృష్టించారు
- నుదిట సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశాం
- రూ.83 వేల కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు
- గుజరాత్‌లోని భుజ్‌లో జరిగిన ర్యాలీలో మోడీ వ్యాఖ్య

ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ప్రతీకారదాడులకు ప్రయత్నించగా, భారత సైన్యం వాటిని తిప్పికొట్టినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దేశ విభజన తర్వాత ఏర్పడిన పాకిస్థాన్ భారత్తో శత్రుత్వమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆరోపించారు.


6లో

సూర్య వెబ్‌సైట్
సూర్య ఈ - పేపర్

## సినీరంగంలో కొందరు
# అహంభావంతో ఉన్నారు


2లో

- సాయం చేస్తున్నా...వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు
- మాకు సమాచారం ఇవ్వకుండా థియేటర్ల బంద్ ఎలా ప్రకటించారు
- మంత్రి దుర్గేష్

సినీ పరిశ్రమ పెద్దలు వ్యవహరిస్తున్న తీరుపై లేటెస్ట్‌గా మంత్రి కందుల దుర్గేశ్ అసహనం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం సినిమా పరిశ్రమకు ఎంతో సహకరిస్తోందని తెలిపారు. కానీ, కొందరి మాటలు అహంభావపూరితంగా ఉన్నాయని, ప్రతిసారీ ఎవరో ఒకరు టికెట్ల ధరలు పెంచమని వస్తున్నారని.. అందుకు మేం ఓకే చేస్తున్నాం. ఆ వెంటనే ఎవరో ఒకరు కోర్టుల్లో పిల్ వేస్తున్నారని తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## రాహుల్ గాంధీ ముందుచూపే..
# కుల గణన సర్వే చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం



- కాంగ్రెస్ ఒత్తిడితోనే కేంద్రం నిర్ణయం తీసుకుంది
- రాహుల్ గాంధీ వల్లనే కులగణన సాకారం కాబోతుంది
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

# మహానాడులో లోకేష్‌కు పార్టీ పగ్గాలు

- కడప మహానాడులో నిర్ణయం
- నేటి నుండి మూడు రోజులపాటు నిర్వహణ

తెలుగుదేశం పార్టీ మహానాడు ఈసారి మహా మార్పుకు వేదిక కానుంది. ఆ పార్టీ యువనేత నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించనున్నారు. కడపలో జరిగే మహానాడులో ఈ మేరకు నిర్ణయం జరగనుంది. మంగళవారం నుంచి మూడు రోజులపాటు కడపలో మహానాడు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి దాదాపు అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి.


2లో

## కాంగ్రెస్ వస్తే కరెంట్
# ఉండదన్న కేసీఆర్

- విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లన్నీ కాంగ్రెస్ పార్టీ హయంలోనివే
- మిగులు విద్యుత్ ఉత్పత్తి ఉండేలా.. ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం
- డిప్యూటీ సీఎం భట్టి

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని అన్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుర్తు చేశారు. విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు పెట్టకుండా ఎలా ఇస్తున్నారు.. ఉన్నవన్నీ కాంగ్రెస్ పార్టీ హయంలోనివే అని చెప్పాను.. భద్రాద్రి, యాదాద్రి నుంచి కరెంటు ఉత్పత్తి కాలేదని చెప్తే కేసీఆర్ నుంచి సమాధానం లేదు.. మిగులు విద్యుత్ ఉత్పత్తి ఉండేలా ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు సాగుతున్నాం..


3లో

## అంతా ఇంతే!




ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ ద్వారా మహానాడుకు వైఎస్‌ను ఆహ్వానిద్దాం సార్

## వన్ నేషన్, వన్ ఎలక్షన్
# ఆచరణ సాధ్యమే


2లో

- దేశానికి, తమిళనాడుకు ఇదేమీ కొత్త కాదు
- చెన్నైలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్

తమిళనాడు బిజెపి ఆధ్వర్యంలో 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' విధానంపై చర్చాగోష్టిని చెన్నై తిరువాన్మియూర్‌లోని రామచంద్ర కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో తమిళనాడు బిజెపి అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్‌తో సహా బిజెపి ప్రముఖులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

## న్యాయ వ్యవస్థలో బీసీలకు
# అన్యాయమేనా?

- న్యాయ వ్యవస్థలో సైతం అగ్రకులాల ఆధిపత్యమే
- 85% ఉన్న బహుజనులకు అన్యాయం
- న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్ లేకపోవడం వల్లనే అన్యాయం
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలోనూ బీసీలకు అన్యాయం
- బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఛైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ టి. చిరంజీవులు


3లో

ప్రజాస్వామ్యం యొక్క ముఖ్యమైన మూడు స్తంభాలు శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ. ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వతంత్ర న్యాయవ్యవస్థ వెన్నెముక లాంటిది.

## పంచాయతీలకు
# కార్యదర్శులే బాస్

- కార్యదర్శులు లేని గ్రామ స్వరాజ్యాన్ని ఊహించుకోలేం
- గత ప్రభుత్వం షరతులతో నియామకం చేపట్టింది
- న్యాయపరమైన సలహాలు తీసుకోవడంతో పాటు క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్తా
- సచివాలయంలో తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ ప్రతినిధులతో మంత్రి సీతక్క

ఎంచాయతీ కార్యదర్శులు సమస్యల నమస్కారం పట్ల మా ప్రభుత్వం సానుకూలంగా ఉంది అని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృాఎద్ది, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



3లో



# మహానాడుకు వెళ్తూ కార్యకర్త టీ బండి వద్ద లోకేష్!

కుప్పం/శాంతిపురం: కుప్పం నియోజకవర్గం శాంతిపురానికి చెందిన చెంగాచారి సాధారణ టిడిపి కార్యకర్త. గృహప్రవేశం నిమిత్తం కుప్పం వచ్చి గత రెండురోజులుగా బిజీబీజీగా ఉన్న రాష్ట్ర మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను కలిశాడు. చెంగాచారి బాగోగులను వాకబుచేసిన లోకేష్ మాటల్లో ఏం చేస్తుంటావని అడిగాడు. తాను తెలుగుదేశం పార్టీ వీరాభిమానినని, శాంతిపురంలో టీకొట్టు నడవుతూ జీవనం సాగిస్తున్నానని చెప్పాడు. కుప్పం నుంచి కడప మహానాడుకు బయలుదేరిన యువనేత లోకేష్ సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా టీకొట్టు వద్దకు వెళ్లాడు. అన్నా... చాలా దూరం వెళ్లాలి... టీ ఇస్తావా అని అడిగాడు. చెంగాచారికి కొద్దిసేపు నోటమాట రాలేదు. తమ అభిమాననేత నేరుగా తమ కొట్టుకురావడంతో సంభ్రమాశ్చర్యానికి లోనయ్యాడు. యువనేత లోకేష్ కు టీ గ్లాసు అందించాడు. వ్యాపారం ఎలా ఉందని అడగ్గా చెంగాచారి స్పందిస్తూ... సర్... నేను 1994 నుంచి తెలుగుదేశం పార్టీలో ఉంటున్నా. చంద్రబాబు గారంటే అభిమానం. నేను టిడిపికి చెందిన వాడినన్న కోపంతో గత అయిదేళ్లుగా నా టీ అంగడిని మూయించేశారు. గత ఏడాది జూన్ 12న చంద్రబాబు గారు సిఎంగా ప్రమాణ స్వీకారం చేశాక 17వతేదీ మళ్లీ టీకొట్టు ప్రారంభించా. నాకు ఇద్దరు ఆడబిడ్డలు, ఒకబిడ్డకు పెళ్లయింది... మరో కూతురికి పెళ్లి చేయాలి. మీరు మా అంగడికి రావడం నమ్మలేక పోతున్నా చిన్నయ్యా అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. చెంగాచారి భుజం తట్టిన యువనేత లోకేష్... ఇప్పుడు నువ్వు ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. నీ వెంట నేనున్నా... ఏ అవసరమొచ్చినా నాకు ఫోన్ చెయ్యి అని చెప్పి ముందుకు సాగారు. కార్యకర్తకు యువనేత లోకేష్ ఎంతటి ప్రాధాన్యత నిస్తారనడానికి ఇదొక మచ్చుతునక.

# వన్ నేషన్, వన్ ఎలక్షన్ ఆచరణ సాధ్యమే

● దేశానికి, తమిళనాడుకు ఇదేమీ కొత్త కాదు

● చెన్నైలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తమిళనాడు బిజెపి ఆధ్వర్యంలో 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' విధానంపై చర్చాగోష్టిని చెన్నై తిరువాన్మియూర్‌లోని రామచంద్ర కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో తమిళనాడు బిజెపి అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్‌తో సహా బిజెపి ప్రముఖులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జనసేనాని పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. 1952-67 వరకు దేశంలో ఒకేసారి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగాయని గుర్తు చేశారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ల వల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగదని ఆయన స్పష్టం చేశారు. అందుకు ఉదాహరణే గత రెండు ఎన్నికలలో ఏపీ, తెలంగాణ ప్రాంతీయ పార్టీలు గెలుస్తున్నాయని వివరించారు.

**తెలంగాణలో టీఆర్ఎస్ వరుసగా రెండు సార్లు**

గెలిచిందన్నారు. ఏపీలో 2014 టీడీపీ, 2019లో మరో పార్టీ గెలిచిందని.. గత ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఎంపీ, అసెంబ్లీలో ఎన్నికలలో గెలిచిందన్నారు. ఆ గెలుపునకు ప్రాంతీయపార్టీలే కీలకంగా మారాయన్నారు ఒడిస్సా, తెలంగాణలో పరిస్థితులు భిన్నంగా ఉంటాయని, అక్కడ బీజేపీ లబ్ధి పొందలేదు.. ఆశించినంత గెలవలేదు కదా..?అని ప్రశ్నించారు. ప్రస్తుతం, ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందని డీఎంకే చెప్పడం విడ్డురంగా ఉందన్నారు..

**స్టాలిన్ వ్యతిరేకతకు అర్థం ఏంటో..?:**

ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని కరుణానిధి మద్దతు ఇచ్చారు. కానీ స్టాలిన్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో తమిళంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తమిళ దేవుడు మురుగ స్వస్థలం తమిళనాడు అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తమిళంలో మాట్లాడుతూ, నేను పూజించే తమిళ దేవుడు మురుగ స్వస్థలం, మహాకవి స్వస్థలం, సిద్ధుల స్వస్థలం, నాకు చాలా ఇష్టమైన ఎంజిఆర్ స్వస్థలం. తమిళనాడుపై నాకు ఎప్పుడూ గౌరవం ఉంది" అని అన్నారు.ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి మద్దతు ఇచ్చారు. కానీ ఆయన కుమారుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యతిరేకిస్తున్నారు. దీనిని వ్యతిరేకిస్తున్నవారు కరుణానిధి రాసిన 'నేంజుక్కు నీతి' పుస్తకం చదవాలి. ఎందుకంటే కరుణానిధి ఆ పుస్తకంలో ఒకే దేశం ఒకే ఎన్నికకు మద్దతు ఇచ్చినట్లు రాశారు" అని పవన్ కల్యాణ్ అన్నారు.

**ఒకే దేశం ఒకే ఎన్నికపై తప్పుడు సమాచారం:**

"ఒకే దేశం ఒకే ఎన్నికపై తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోందని..కొందరు దీనిపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం తీసుకొచ్చి ఉంటే మద్దతు ఇచ్చేవారు. గెలిస్తే ఈవీఎం సూపర్ అని, ఓడిపోతే అక్రమాలు జరిగాయని అంటున్నారు" అని ఆయన అన్నారు.

**ఒకే దేశం ఒకే ఎన్నికతో ప్రయోజనాలు:**

ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల కలిగే ప్రయోజనాల గురించి మాట్లాడుతూ, "తరచుగా ఎన్నికలు జరగడం వల్ల మన దేశం ఎన్నికల పనుల్లోనే కూరుకుపోతోంది. అధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు నిరంతరం పనిచేయాల్సి వస్తోంది. ఎన్నికల ఖర్చుల వల్ల ప్రజా సంక్షేమ పథకాల అమలులో జాప్యం జరుగుతోంది. ఒకే దేశం ఒకే ఎన్నిక ద్వారా ఎన్నికల ఖర్చు తగ్గించవచ్చు. ప్రజలకు మరిన్ని పథకాలు అమలు చేయవచ్చు" అని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జాతీయ కన్వీనర్ అనిల్ ఆంథోనీ, బీజేపీ తమిళనాడు నేతలు అర్జున మూర్తి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# సినీరంగంలో కొందరు అహంభావంతో ఉన్నారు

● సాయం చేస్తున్నా...వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు ● మాకు సమాచారం ఇవ్వకుండా థియేటర్ల బంద్ ఎలా ప్రకటించారు ● మంత్రి దుర్గేష్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సినీ పరిశ్రమ పెద్దలు వ్యవహరిస్తున్న తీరుపై లేటెస్ట్‌గా మంత్రి కందుల దుర్గేశ్ అసహనం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం సినిమా పరిశ్రమకు ఎంతో సహకరిస్తోందని తెలిపారు. కానీ, కొందరి మాటలు అహంభావపూరితంగా ఉన్నాయని, ప్రతిసారీ ఎవరో ఒకరు టికెట్ల ధరలు పెంచమని వస్తున్నారని.. అందుకు మేం ఓకే చేస్తున్నాం. ఆ వెంటనే ఎవరో ఒకరు కోర్టుల్లో పిల్ వేస్తున్నారని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. విజ్జ్వాడ్లో నేడు ఆయ్న మీడియాతో మాట్లాడుతూ, ఇటువంటి నిర్ణయాల వల్ల ఆయా అధికారులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని చెప్పారు. అయినా మేం సినిమా పరిశ్రమ అభివృఎద్ధి కోసం రేట్లు పెంపునకు అనుమతిస్తున్నాం అని మంత్రి కందుల దుర్గేష్ వివరణ ఇచ్చారు. ఒక సినిమా నిర్మాణం వెనుక చాలామంది కృఎషి ఉంటుంది. అలాంటి సినిమా మీద వందలాది కుటుంబాలు ఆధారపడి ఉంటాయి. ఇలా సడెన్ గా ఎవరితో చర్చించకుండా థియేటర్స్ బంద్ పెట్టాలనే నిర్ణయాలు తీసుకోవడం తగదని హెచ్చరించారు. హరిహర వీరమల్లు విడుదల సమయంలోనే ఈ థియేటర్ల బందు అనే విషయం.. ఎందుకు బయటకు వచ్చిందని ప్రశ్నించారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఒక గ్రూవులా ఏర్పడి, ఎవరితో చర్చించి థియేటర్ల బంద్‌కు పిలువునిచ్చారో తెలుసుకోవాలని హోంశాఖ కార్యదర్శిని విచారణ చేయమని కోరానని వెల్లడించారు. ఇప్పటికైనా సినిమా ఇండస్ట్రీకి చెందిన పెద్దలు ముఖ్యమంత్రిని కలసి వారి సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా తాను ఫిలిం ఛాంబర్ కు లేఖ కూడా రాశాను. సినిమా రంగానికి సంబంధించి ప్రత్యేక పాలసీని రూపొందించాలని చూస్తున్నామని లేఖలో వివరంగా రాసానని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం మాదిరిగా మా ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండవని.. కొంతమంది అహంకార ధోరణి తో మాట్లాడటం మానేసి అధికారులతో చర్చలు జరపాలని మంత్రి కోరారు. ఇటీవలే ఓ మాజీ మంత్రి సినిమా విషయంలో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధిగా అలా మాట్లాడటం చాలా తప్పు అని మంత్రి కందుల అన్నారు.

# మహానాడులో లోకేష్‌కు పార్టీ పగ్గాలు

● కడప మహానాడులో నిర్ణయం ● నేటి నుండి మూడు రోజులపాటు నిర్వహణ




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తెలుగుదేశం పార్టీ మహానాడు ఈసారి మహా మార్పుకు వేదిక కానుంది. ఆ పార్టీ యువనేత నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించనున్నారు. కడపలో జరిగే మహానాడులో ఈ మేరకు నిర్ణయం జరగనుంది. మంగళవారం నుంచి మూడు రోజులపాటు కడపలో మహానాడు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి దాదావు అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. స్వల్ప ఆటంకాలను ఎదుర్కొని సమీకరణకు పెద్ద ఎత్తున సన్నాహాలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి ఈసారి రాయలసీమ వేదిక అయింది .ఇంతకుముందు ఒంగోలు రాజమండ్ర లో టిడిపి మహానాడు నిర్వహించగా ఇప్పుడు కడప గడపలోకి మహానాడు అడుగుపెట్టింది. కరోనా అనంతరం 2022లో ఒంగోలులో మహానాడు నిర్వహించారు. తదుపరి 2023లో రాజమండ్రలో ఈ కార్యక్రమం జరగ్గా 2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది మహానాడు వాయిదా పడింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాజాగా ఈ ఏడాది మహానాడు నిర్వహణ కు కడపను సిద్ధం చేశారు. కడపలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మహానాడు ను విజయవంతం చేయడానికి పార్టీ అధిష్టానం అన్ని ఏర్పాట్లు చేసింది .ఈ మహానాడు నిర్వహణ కోసం 19 కమిటీలు ఏర్పాటు చేశారు. ఆహ్వాన కమిటీ లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆ పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు తెలంగాణ నుంచి పోలిక బ్యూరో సభ్యులు బక్కని నరసింహాలకు చోటు దక్కింది. మిగిలిన 18 కమిటీలలో రాష్ట్ర మంత్రులు పోలిట్ బ్యూరో సభ్యులు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఉన్నారు. వీరంతా గత వారం రోజుల నుంచి మహానాడు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఏర్పాట్లు సోమవారం సాయంత్రానికి పూర్తి కాగా ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి మహానాడుకు తరలివచ్చేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యారు. ఇప్పటికే అనేక ప్రాంతాల నుంచి ప్రజలు మహానాడు ప్రాంగణానికి చేరుకున్నారు. అన్ని ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రం నుంచి బయలుదేరిన పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మంగళవారం ఉదయం నాటికి కడప చేరనున్నారు. వీరికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వసతి తోపాటు బస, భోజనాలు ,అల్పాహారం తాగునీరు వగైరా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

**మహా బెడద :** టిడిపి మహానాడుకు కరోనా మహా బెడదగా తయారైంది. దేశవ్యాప్తంగా కరోనా విజృఎంభించడంతో కడపలో మహానాడు నిర్వహణ కు కొంతమేర ఆటంకాలు ఎదురయ్యాయి. కరోనా విజృఎంభిస్తున్న నేపథ్యంలో కడపలో తెలుగుదేశం పార్టీ మహానాడు వాయిదావేయాలని కోరుతూ స్థానిక వైసీపీ నాయకులు ఆ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు హర్ష కుమార్ ఏకంగా దీనిపై కోర్టులోనే వేశారు. లక్షలాదిగా జనం ఒకే చోట గుమిగూడడంతో కరోనా విస్తృఎతికి దోహద పడుతుందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి టిడిపి సంసిద్ధమయింది. ఇదిలా ఉండగా ఈ నెల 21న కోవిడ్ పై అన్ని జిల్లాల్లో చర్యలు తీసుకోవాలని ఆ చర్యలు కఠినంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఓ సర్కులర్ జారీ అయింది. కడప లో మహానాడు నిర్వహణ నేపథ్యంలో ఆ సర్కులర్ ను సవరిస్తూ సోమవారం మరో సర్కిల్ జారీ చేశారు. ఈనెల 21న జారీ చేసిన కరోనా సర్కులర్ కఠిన చర్యలను సూచిస్తుండగా సోమవారం విడుదలైన సర్కులర్ అందుకు భిన్నంగా ఉండడంతో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి .ఏదేమైనప్పటికీ కరోనా నియమాలు పాటిస్తూ మహానాడు సజావుగా నిర్వహించేందుకు మాస్కులు,శానిటైజర్ సిద్ధం చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మహానాడును నిర్వహించాలనే తలంపుతో పార్టీ కనిపిస్తోంది.

**మహా మార్పు :** కడప మహానాడులో తెలుగుదేశం పార్టీలో మహా మార్పు చోటు చేసుకోనుంది. యువనేత రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించనున్నారు .ఈ మేరకు ఈ మహానాడులో తీర్మానం జరగనుంది. ఇప్పటికే అన్ని జిల్లాల్లో మినీ మహానాడు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి తీర్మానాలు సేకరించడం జరిగింది. వాటిలో ప్రధానంగా అన్ని జిల్లాల నుంచి నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించాలనే అభిప్రాయం వ్యక్తమయింది. దీంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ కు బాధ్యతలు అప్పగించనున్నారు. ఇకపై పార్టీ కార్యక్రమాలు అన్ని నారా లోకేష్ ఆధ్వర్యంలోని జరుగుతాయి .చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృఎద్ధికి పరిమితం అవుతారు. పార్టీ అభీష్టం మేరకే ఈ నిర్ణయం జరుగుతున్నట్టుగా తెలుస్తుంది. 70వ దశకంలో ఉన్న నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృఎద్ధి కోసం పరితపిస్తున్నారు. ఈయన 19 95లో తొలిసారిగా ముఖ్యమంత్రిగా తదుపరి 1999 లో ఆ తర్వాత 2014లో మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసి 2024 లో నాలుగో సారి రాష్ట్ర ముఖ్యమంత్రి గా పగ్గాలు చేపట్టారు. తెలుగుదేశం పార్టీతో పాటు రాష్ట్ర పరిస్థితులు క్లిష్టమైనప్పుడు వాటిని పరిష్కరించే బాధ్యతను భుజాలపై వేసుకొని చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారు .1983 లో తెలుగుదేశం పార్టీ ఎన్టీ రామారావు నాయకత్వంలో అధికారంలోకి రాగా ఆ తర్వాత నాదెండ్ల భాస్కర్ రావు రూపంలో ఏర్పడ్డ సంక్షోభం నుంచి అప్పుడు చంద్రబాబు నాయుడు పార్టీని గట్టెక్కించారు. ఆనాడు చంద్రబాబు నాయుడు ప్రతిభను స్వయంగా చూసిన ఎన్టీ రామారావు చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ఆయన 1985లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి కుప్పం నియోజకవర్గంలో పోటీ చేసి గెలుపొందారు. అప్పటినుంచి ఇప్పటివరకు కుప్పం నియోజకవర్గం నుంచి చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్తావన కొనసాగుతుంది. ఆ తర్వాత 1995లో లక్ష్మీపార్వతి రూపంలో ఏర్పడ్డ సంక్షోభం నుంచి పార్టీని కాపాడి ఎన్టీఆర్ కుటుంబంతో కలిసి పార్టీ పగ్గాలు చేపట్టిన చంద్రబాబు నాయుడు నాటి నుంచి నేటి వరకు పార్టీని సింగిల్ హ్యాండ్ తో నడుపుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో 2014లో ఏర్పడ్డ రాష్ట్ర విభజనతో ఆంధ్ర ప్రదేశ్ విడిపోగా కొత్తగా ఏర్పడ్డ నవ్యాంధ్ర కోసం ఆ ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిగా చేశారు .2019లో పార్టీ ఓటమూ పాలు కాగా 2024 లో తిరిగి తెలుగుదేశానికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో కడపలో జరుగుతున్న ఆ పార్టీ మహానాడు ఎంతో ప్రతిష్టాత్మకం కానుంది.

# ఇంకొల్లులో తెలుగుదేశం శ్రేణుల ఆనందోత్సాహం

● పర్చూరు ఇంకొల్లు రోడ్డు నిధుల విడుదల పట్ల హర్షం ● సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి జనార్దన్ రెడ్డి,ఎమ్మెల్యే ఏలూరి చిత్రపటాలకు పాలాభిషేకం ● ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపిన నేతలు ● అభివృద్ధి సంక్షేమమే ఎమ్మెల్యే ఏలూరి లక్ష్యం ● మండల పార్టీ అధ్యక్షులు హనుమంతరావు, శ్రీహరి, శంసుద్దీన్



ఇంకొల్లు – పర్చూరు రహదారి నిర్మాణానికి రూ. 23.88 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. వైకాపా ఐదేళ్ల పాలనలో రహదారులు అభివృఎద్ధి, మరమ్మతులు లేక ప్రజలు వాహనదారులు నరకయాతన అనుభవించారని, కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత రహదారులకు మహర్దశ పట్టిందని తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కారంచేడు పర్చూరు ఇంకొల్లు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల నేతలు సంబరాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఇంకొల్లు మండల కేంద్రానికి చేరుకొని వాహన శ్రేణిగా వంకాయలపాడు పూసపాడు బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రోడ్లు భవనాల శాఖ మాత్యులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిత్రపటాలకు పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఎమ్మెల్యే ఏలూరి నాయకత్వం వర్ధిల్లాలంటూ , అభివృఎద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, తిరుమల శెట్టి శ్రీహరి, షేక్ షంషుద్దీన్, బేతపూడి సురేష్ లు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో గ్రామీణ రహదారుల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల మరమ్మతులు ప్రయాణికుల కష్టాలకు చెక్ పెట్టారని పేర్కొన్నారు. వైసీపీ నేతల వక్రబుద్ధితో గత ఐదేళ్లు ఇంకొల్లు పర్చూరు రహదారి అభివృఎద్ధికి నోచుకోలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ పాలనలో రహదారులకు మార్దశ పట్టుకుందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరైన అనేక రహదారులను అభివృఎద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపి వేసిందని మండిపడ్డారు. కాంట్రాక్టర్ను వేధించి పనులు నిలిపివేసిన ఘనత వైసీపీ నేతలకే దక్కిందనన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పట్టుబట్టి పర్చూరు ఇంకోల్లు రహదారి నిర్మాణానికి విశేష కృఎషి చేశారని గుర్తు చేశారు. ఆర్ అండ్ బి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని పలుమార్లు కలిసి రోడ్డు దుస్థితిని వివరించారని పేర్కొన్నారు. రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రోడ్డుకు సంబంధించి వీడియోలు ఫోటోలను మంత్రికి అందించి తక్షణమే నిధులు మంజూరు చేయాలని విన్నవించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవతో ఈ రోడ్డుకు మోక్షం కలిగిందని నాయకులు పేర్కొన్నారు. ఆర్ అండ్ బి మంత్రి జనార్దన్ రెడ్డి,ఎమ్మెల్యే ఏలూరి కి కృఎతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు బత్తుల శ్రీనివాసరావు, కాసిం, పేర్ని బాపయ్య, కర్రి శ్రీనివాసరావు, దండ శ్రీనివాసరావు,మార్కు, కరణం రమేష్, గోరంట్ల సురేష్, సతీష్,బండ్ల శ్రీనివాసరావు ,సాంబయ్య సీతారామయ్య, మీరావలి , చిలుకూరి శ్రీనివాసరావు, మస్తాన్ బాబా, వెంకట్రావు, రఘురాం, శ్రీనివాసరావు, భాస్కర్ ,రమాదేవి, కర్రీ నాగేంద్రమ్మ, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 4న ఏపీ కేబినెట్ భేటీ



ఏపీ కేబినెట్ భేటీ ముహూర్తం ఖరారైంది. వచ్చే నెల 4న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. వచ్చే నెల 12కు కూటమి పాలన ఏడాది పూర్తవుతుంది.దానికోసం జిల్లాల వారీగా నిర్వహించే కార్యక్రమాలపై చర్చ నిర్వహించనున్నారు.అలాగే తల్లికి వందనం పథకం విధి విధానాలపై కూడా చర్చించనున్నారు.

# వైఎస్సార్ కడప ఓకే : షర్మిలా



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా సంస్థల పేర్లు మార్చడం సర్వసాధారణంగా జరుగుతున్నదే. అలాగే జిల్లాల పేర్లను కూడా గతంలో పలుమార్లు మార్చారు. ఇదే క్రమంలో తాజాగా కూటమి ప్రభుత్వం గతంలో వైసీపీ ప్రభుత్వం మార్చిన వైఎస్సార్ జిల్లా పేరును మరోసారి మారుస్తూ ఇవాళ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె, పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల స్పందించారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడపగా మారుస్తూ ఇవాళ ఉత్తర్వులు ఇచ్చిన కాసేపటికే ఎక్స్ లో షర్మిల దీనిపై స్పందించారు. మహానాడు ముచ్చటలో వైఎస్సార్ పేరే పలకాల్సి వస్తుందని ఒక్కరోజు ముందు ఏకంగా జిల్లా పేరునే మార్చేశారని ఆక్షేపించారు. వ్యక్తిగతంగా ఇది బాధించే అంశమే అయినా.. కడప జిల్లా చరిత్రను, సంప్రదాయాలను గౌరవిస్తూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. మహానేత మరణానంతరం కడప జిల్లాకు వైఎస్సార్ కడపగా పేరు పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్ పేరుమీద కక్ష్యపూరిత రాజకీయాలు అజెండా కాదు అనుకుంటే, పేర్లు మార్పు వెనుక మీకు దురుద్దేశ్యం లేకుంటే, సెంటిమెంట్ ప్రకారం పాత జిల్లా పేర్లు కొనసాగించాలని కోరిక ఉంటే, విజయవాడ నగరానికి ఎన్టీఆర్ జిల్లాగా కాకుండా, ఎన్టీఆర్ విజయవాడ జిల్లాగా పేరు మార్చాలని వైఎస్ షర్మిల కోరారు. వైఎస్సార్ జిల్లా వైఎస్సార్ కడప జిల్లాగా మార్చినప్పుడు ఎన్టీఆర్ జిల్లాను ఎన్టీఆర్ విజయవాడ జిల్లాగా మారిస్తే తప్పేంటని ప్రశ్నించారు. వైఎస్సార్ , ఎన్టీఆర్ ఇద్దరు తెలుగు జాతి గర్వించే ఈ గడ్డ కన్న బిడ్డలేనని షర్మిల తెలిపారు. ప్రజల గుండెల్లో ఇద్దరిది సమాన స్థానమే అన్నారు. ఒకరికి ఒకలా, మరొకరి మరోలా రాజకీయాలు ఆపాదించవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబును షర్మిల డిమాండ్ చేశారు.

# కడప కాదు...వైఎస్ఆర్ కడప జిల్లానే




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : నేటి నుంచి మూడు రోజులపాటు మహానాడు జరగనున్నది. ఈ సందర్భంగా పార్టీ పరంగా అనేక నిర్ణయాలు తీసుకుంటారు. ఇదేమీ ఆశ్చర్యం కాదు. అయితే ప్రభుత్వం ఇంతకు మించి సంచల నిర్ణయం జరిగింది. వైఎస్సార్ కడప జిల్లా పేరును కడప జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం జీఓలో పేర్కొంది. వైఎస్సార్ జిల్లాకు కడప పేరును కలపాలని గతంలోనే రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. కాగా 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కడప జిల్లాకు వైఎస్సార్ కడప జిల్లాగా పేరు పెట్టిన విషయం తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు మీద ఆయన సొంత జిల్లాకు పేరు పెట్టారు. కానీ, ఇప్పుడు ఆ పేరును తొలగిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# సైబర్ మోసాలకు చెక్ పెట్టనున్న ఎయిర్‌టెల్

ప్రస్తుతం పెరుగుతున్న టెలికాం మోసాలు, స్కాంలను అరికట్టేందుకు ప్రముఖ టెలికాం ఎయిర్‌టెల్ ముందడుగు వేసింది. ఈ క్రమంలో ఈ మోసాలపై చర్యలు తీసుకునేందుకు జియో, వొడాఫోన్ ఐడియాలను కూడా సంప్రదించి ట్రాయ్‌కు సమాచారం అందించింది. అయితే 2024లో మొత్తం 17 లక్షలకు పైగా సైబర్ మోసాలకు సంబంధించి ఫిర్యాదులు నమోదయ్యాయని, దాని వల్ల రూ.11,000 కోట్లకు పైగా నష్టం సంభవించినట్లు లేఖలో పేర్కొంది.

# కాకాణికి 14 రోజుల రిమాండ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో వైసీపీ మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఇవాళ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నెల్లూరు జిల్లాలో అక్రమ మైనింగ్ కేసులో దాదావు రెండు నెలలుగా తప్పించుకుని తిరుగుతున్న ఆయన్ను తాజాగా అరెస్టు చేసిన పోలీసులు ఇవాళ వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపర్చారు. దీంతో ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో కాకాణిని పోలీసులు జైలుకు తరలిస్తున్నారు. చెన్నైలో నివసించే విద్యాకిరణ్ అనే వ్యక్తికి నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తాటిపర్తి సమీపంలో 32 ఎకరాల్లో రుస్తుం మైన్స్ ఉన్నాయి. దాని లీజు గడువు ముగియడంతో రెన్యువల్‌కు దరఖాస్తు చేశారు. దీన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో రెన్యువల్ చేయకుండా అక్రమంగా ఆక్రమించుకుని క్వార్ట్జ్ తవ్వుకుని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు కాకాణిపై ఉన్నాయి. వైసీపీ హయాంలో విచ్చలవిడిగా సాగిన ఈ దందాపై కేసు నమోదు చేసిన కూటమి ప్రభుత్వం కాకాణి కోసం గాలిస్తోంది. ఈ నేపథ్యంలో బెంగళూరు సమీపంలోని ఓ రిసార్ట్ లో కాకాణి ఉన్నట్లు తెలియడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు అరెస్టు చేసి నెల్లూరుకు తీసుకొచ్చారు. కోర్టులో హాజరుపర్చడంతో 14 రోజుల రిమాండ్ విధించారు. గతంలో ఈ కేసులో విచారణకు హాజరు కావాలని పలుమార్లు పోలీసులు నోటీసులు ఇచ్చినా కాకాణి పట్టించుకోలేదు. అంతే కాదు హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లినా ఆయనకు నిరాశే ఎదురైంది. దీంతో అరెస్టు తప్పదని నిర్ధారణకు వచ్చాక అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇలా 55 రోజులు అజ్ఞాతంలో ఉన్న ఆయన్ను పోలీసులు నిన్న అదుపులోకి తీసుకున్నారు.

## ముమ్మిడివరంలో యువకుల గల్లంతుపై

# సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం కమినిలంక సమీపాన గోదావరిలో ఎనిమిది మంది యువకులు గల్లంతవ్వడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోదావరిలో స్నానానికి దిగి ఎనిమిది మంది యువకులు గల్లంతైన విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడారు. గల్లంతైన యువకుల కోసం చేపట్టిన గాలింపు చర్యల గురించి సీఎంకు కలెక్టర్ వివరించారు. గల్లంతైన వారిని రక్షించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సీఎం సూచించారు.

**హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి :** నీటి ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులకు సీఎం పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలోని నీటి వనరులు ఉన్న అన్ని ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నీటి కుంటలు, చెరువులు వంటి ప్రాంతాలను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

సూర్య
విజయవాడ
మంగళవారం
27 మే 2025



# సంపాదకీయం

editpage@suryaa.com

## అదరహో ... భారత్!

ఇటీవలి కాలంలో, ముఖ్యంగా 2024–25 నాటికి భారతదేశం ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. జర్మనీని అధిగమించి భారతదదేశం సుమారు 4.2 ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి (జిడిపి ) తో ఈ ఘనతను సాధించింది. ఇది దేశానికి గర్వకారణం మాత్రమే కాదు, భవిష్యత్తు ఆశావహతకు మూలమైన ఘట్టం కూడా. ఈ ఆర్థిక పురోగతికి తోడు, దేశం రక్షణ రంగంలోనూ గొప్ప పురోగతిని నమోదు చేసింది. స్వదేశీ ఆయుధ తయారీ, ఆర్మీ ఆధునీకరణ, కొత్త యుద్ధవిమానాలు, తాత్కాలిక మారణాయుధాల తయారీ, అంతరిక్ష రక్షణ వ్యవస్థలు –ఇవన్నీ భారత దేశాన్ని మిలిటరీ పరంగా మరింత బలంగా నిలిపాయి. దేశ సైన్యం ప్రస్తుతం ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద సైన్యంగా ఉంది. ఇలాంటి పురోగతులు కేవలం రక్షణ పరంగా గాక, ఆర్థికంగా కూడా భారత్ను గౌరవనీయమైన స్థానంలో నిలిపాయి. భారతదేశం అంతర్జాతీయ మాంచి సంబంధాలను కలిగి ఉండటంతో పాటు, వ్యూహాత్మక ఒప్పందాలు కూడా చేసుకుంటోంది. క్వాడ్ వంటి అంతర్జాతీయ సంస్థలలో భాగస్వామ్యం, బ్రిక్స్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల మాంచి సంబంధాలు భారతదేశానికి మరింత స్థిరతను కల్పిస్తున్నాయి.

భవిష్యత్తులో, అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు కూడా భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా 2028 నాటి కి ఎదగబోతుందని అంచనా వేస్తున్నాయి. ఇది కేవలం అభివృద్ధి కాదు, అది దేశ ప్రజల శ్రమకు, పాలకుల దృఢ సంకల్పానికి దర్పణం. భారతదేశ ఆర్థిక పురోగతికి పునాది వేసిన ముఖ్య రంగాలలో సేవల రంగం మొదటిది. ప్రపంచంలోని ప్రముఖ ఐటీ సంస్థలు భారతదేశం నుంచి సాఫ్ట్వేర్ సేవలు తీసుకుంటున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, పూణే వంటి నగరాలు గ్లోబల్ ఐటీ హబ్లుగా ఎదిగాయి. అలాగే విదేశాల నుంచి పెట్టుబడులు రాబట్టడం లోనూ భారత్ శక్తివంతంగా పనిచేసింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వృద్ధి భారత దేశం మీద నమ్మకాన్ని సూచిస్తోంది. రక్షణ రంగంలో భారత్ వేగంగా ముందుకు సాగింది. డి ఆర్ డి ఓ వంటి పరిశోధనా సంస్థలు దేశీయంగా కొత్త ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నాయి. హెచ్ఏఎల్ సంస్థ ద్వారా స్వదేశీ యుద్ధ విమానాలైన తేజస్ లాంటి విమానాలు తయారవుతున్నాయి. భారత్ స్వయం సమృద్ధి లక్ష్యంగా మేకిన్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టి ఆయుధ తయారీ రంగంలో స్వావలంబన దిశగా పయనిస్తోంది. ఈ అభివృద్ధికి తోడు, భారత ప్రభుత్వం ప్రతి ఏడూ రక్షణ బడ్జెట్ను భారీగా పెంచుతూ వస్తోంది. 2024–25 సంవత్సరానికి దేశ రక్షణ బడ్జెట్ సుమారు 6 లక్షల కోట్ల రూపాయలుగా ఉండడం దేశ రక్షణ ప్రాధాన్యతను ప్రతిబింబిస్తోంది. భారత ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ – ఈ మూడు విభాగాలనూ సమర్థంగా ఆధునీకరించేందుకు పెద్ద ఎత్తున వనరులను కేటాయిస్తున్నారు. భారత్ ఇప్పుడు బ్రహ్మోస్ మిసైళ్లను ఇతర దేశాలకు ఎగుమతి చేయగలిగే స్థాయికి చేరుకుంది. ఇది కేవలం ఆయుధ తయారీ రంగంలోనే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా భారత్ ఆర్థిక, వ్యూహాత్మక విశ్వసనీయతను కూడా చూపుతోంది. అంతేకాక, భారత్ యొక్క అణ్వాయుధ సామర్థ్యం దేశ రక్షణకు ఒక కీలక భాగంగా మారింది. ఇస్రో ద్వారా అంతరిక్ష రంగంలోనూ భారతదేశం అద్భుతాలు చేయగలిగింది.

ఈ రీతిలో భారత్ రక్షణ, ఆర్థిక రంగాలలో బలపడటం వల్ల, ఇది దేశ ప్రజలకు భద్రతను కల్పించడమే కాదు, ప్రపంచంలో భారత్కు మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఇప్పుడు దేశ యువత మరింత నమ్మకంతో ముందుకు సాగుతుంది. శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలు, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు భవిష్యత్తులో భారతదేశాన్ని మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా నిలబెట్టే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయి. ఈ ప్రగతిలో ప్రతి భారతీయుడి పాత్ర ఉందని చెప్పాలి. రైతు నుండి వ్యాపారి దాకా, ఉద్యోగి నుండి శాస్త్రవేత్త దాకా అందరూ దేశ అభివృద్ధిలో తమవంతు సహకారం అందిస్తున్నారు. ఇది ఒక శక్తివంతమైన, ఆత్మవిశ్వాసం గల దేశాన్ని తయారుచేస్తోంది. త్వరలోనే, భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారడం అనివార్యమని ప్రపంచం అంచనా వేస్తోంది. ఈ ఆర్థిక పురోగతికి ప్రధానంగా తోడ్పాటునిచ్చినవారు ప్రధానంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం. మోదీ 2014లో ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత, దేశంలో స్థిర పాలన, విదేశీ పెట్టుబడులకు అనువైన వాతావరణం, వ్యాపారానికి తక్కువ కష్టతరత, పన్నుల సంస్కరణలు, మౌలిక సదుపాయాల పెంపు వంటి అనేక రంగాలలో అభివృద్ధికి నాంది పలికారు. “మేక్ ఇన్ ఇండియా”, “స్టార్ట్ అప్ ఇండియా”, “డిజిటల్ ఇండియా”, “స్కిల్ ఇండియా” వంటి పథకాల ద్వారా దేశ యువతకు అవకాశాలు అందించారు. విదేశాలలో భారత ఉనికిని బలోపేతం చేసి, వ్యాపార ఒప్పందాలు, వ్యూహాత్మక సంబంధాల ద్వారా భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయంగా శక్తివంతం చేశారు. ఈ ఆర్థిక పురోగతికి తోడు, దేశం రక్షణ రంగంలోనూ గొప్ప పురోగతిని నమోదు చేసింది. స్వదేశీ ఆయుధ తయారీ, ఆర్మీ ఆధునీకరణ, కొత్త యుద్ధవిమానాలు, తాత్కాలిక మారణాయుధాల తయారీ, అంతరిక్ష రక్షణ వ్యవస్థలు %–% ఇవన్నీ భారత దేశాన్ని మిలిటరీ పరంగా మరింత బలంగా నిలిపాయి. దేశ సైన్యం ప్రస్తుతం ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద సైన్యంగా ఉంది. ఇలాంటి పురోగతులు కేవలం రక్షణ పరంగా గాక, ఆర్థికంగా కూడా భారత్ను గౌరవనీయమైన స్థానంలో నిలిపాయి.

భారతదేశంలో యువత శాతభాగం అత్యధికం. దేశ జనాభాలో సుమారు 65% మంది 35 ఏళ్ల లోపు వయసులో ఉన్నారు. ఈ యువశక్తి సక్రమంగా వినియోగించబడితే, అది భారతదేశానికి డెమోగ్రాఫిక్ డివిడెండ్గా మారుతుంది. ఉద్యోగావకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ప్రొడక్టివిటీ పెంపు వంటి రంగాల్లో దృష్టి పెడితే ఈ శక్తిని అభివృద్ధికి మలచుకోవచ్చు. రెండవ అంశం సేవల రంగం. ఐటీ, ఫినాన్షియల్ సర్వీసులు, హెల్త్కేర్, ఎడ్యుకేషన్ రంగాల్లో భారత్ వేగంగా ఎదుగుతోంది. ఇప్పటికే అమెరికా, యూరప్ దేశాలలో భారత ఇంజినీర్లు, వైద్యులు, టెక్నీషియన్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సేవల ఎగుమతులు దేశానికి విలువైన విదేశీ మారకం ప్రవాహాన్ని కలిగిస్తున్నాయి.

మూడవ అంశం పారిశ్రామిక వృద్ధి. మేక్ ఇన్ ఇండియా పథకం కింద తయారీ రంగానికి పెద్ద పీట వేయడంతో దేశంలో పరిశ్రమలు కొత్తగా స్థాపించబడ్డాయి. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరిగాయి, దేశపు ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది. అదే విధంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కూడా వేగంగా జరుగుతోంది. రోడ్లు, రైళ్లు, విమానాశ్రయాలు, పోర్టులుబీ ఇవన్నీ దేశంలో లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరిచాయి.

నాల్గవ అంశం వ్యవసాయం. మన దేశ జనాభాలో సుమారు 50% మంది వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. ప్రభుత్వ నూతన నైతిక వ్యవసాయ విధానాలు, డిజిటల్ సాంకేతికత ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రకృతి వ్యవసాయం, డ్రోన్ ఆధారిత పరిశీలన, స్మార్ట్ అగ్రికల్చర్ వంటి మార్గాల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

మొత్తం మీద భారత్ త్వరలోనే మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతుంది. రక్షణ వ్యవస్థ,ఆయుధ వ్యవస్థ, అంతర్జాతీయ సంబంధాల లాంటి విషయాల్లో భారత్ గట్టిగా ఉండటం వల్ల ఇది త్వరలోనే సాధ్యమయ్యే అవకాశాలు ఎక్కువ.

# సరికొత్తగా వస్తోంది కరోనా.... తస్మాత్ జాగ్రత్త!



తేజస్వి
హైదరాబాద్

- ఇప్పటికే రెండు రకాల వేరియట్ల గుర్తింపు
- సింగపూర్, అమెరికా వంటి దేశాల్లో కరోనా కొత్త వేరియంట్ల కేసులు
- భారత్లో తెలుగు, తమిళ రాష్ట్రాలలో క్రమక్రమంగా విస్తరణ
- తగిన గుర్తింపు లేక పోవటంతో సామాజిక వ్యాప్తికి దారితీస్తోంది
- ఇమ్యూన్ సిస్టమ్ బలహీనమైనవారిపై తీవ్ర ప్రభావితానికి అవకాశం

కోవిడ్ మహమ్మారి ఇప్పుడు కలకలం రేపడానికి సిద్ధమవుతుంది. 2025 మే నాటికి, భారతదేశంలో ఎన్ బి 1.8.1 మరియు ఎల్ ఎఫ్ .7 అనే రెండు కొత్త కోవిడ్–19 వేరియంట్లు గుర్తించబడ్డాయి. ఎన్ బి .1.8.1 వేరియంట్ తమిళనాడులో, ఎల్ ఎఫ్ 7 వేరియంట్ గుజరాత్లో గుర్తించబడ్డాయి. ఎన్ బి .1.8.1 వేరియంట్లో స్పైక్ ప్రోటీన్ మ్యూటేషన్లు (ఏ435%ూ%, వి445%ూ%, టి478%×%) ఉన్నాయి, ఇవి వైరస్ వ్యాప్తిని పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇండియా, సింగపూర్, అమెరికా వంటి దేశాల్లో కరోనా కొత్త వేరియంట్ల కేసులు పెరుగుతుండటంతో ప్రజల్లో భయాందోళనలు మొదలయ్యాయి. భారతదేశంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన ఎన్ బి .1.8.1 వేరియంట్ కొంతమందిలో ఇప్పటికే ప్రభావం చూపుతోంది. ఇది మునుపటి వేరియంట్లకంటే వేగంగా వ్యాపించే స్వభావాన్ని కలిగి ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా ఇటీవల కోవిడ్ కేసులు మళ్లీ తలెత్తుతున్నాయి. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్ లాంటి నగరాల్లో కొత్త కేసులు నమోదవుతుండటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. జ్వరం, దగ్గు, అలసట వంటి లక్షణాలతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. కొంతమంది ప్రజలు గుర్తించకుండానే వైరస్ను ఇంటికి, ఆఫీస్లకు, సమూహాలకు వ్యాపింపజేస్తున్నారు. ఇది సామాజిక వ్యాప్తికి దారితీస్తోంది. ఈ కొత్త వేరియంట్లు కొన్నిసార్లు లక్షణాలు లేకుండానే వ్యాపిస్తున్నాయి. దీంతో పరీక్షలు చేయించుకోవడంలో ప్రజలు అలసత్వం చూపుతుంటే, వైరస్ మరింత వేగంగా వ్యాపించే ప్రమాదం ఏర్పడుతోంది. ఇప్పటికే సింగపూర్లో ఈ వేరియంట్ కారణంగా ఆసుపత్రులపై ఒత్తిడి పెరిగింది. ప్రభుత్వాలు మళ్లీ మాస్కుల వాడకం, సామాజిక దూరం వంటి నియమాలను పాటించమంటూ ప్రజలకు సూచనలు ఇస్తున్నాయి.

కొత్త వేరియంట్ల లక్షణాలు కొంత భిన్నంగా ఉంటున్నాయి. సాధారణంగా జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలు మామూలుగానే కనిపిస్తాయి కానీ ఎన్ బి .1.8.1 వేరియంట్ విషయంలో అలసట, శరీర నొప్పులు మొదటి లక్షణాలుగా ఉండవచ్చు. కొందరిలో తలనొప్పి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు కూడా లేకుండానే వైరస్ వ్యాపించవచ్చు. ఇది ప్రత్యేకించి వృద్ధులు, హృదయ, ఊపిరితిత్తుల సమస్యలున్న వారు, ఇమ్యూన్ సిస్టమ్ బలహీనమైనవారిని తీవ్రంగా ప్రభావితం చేయగలదు. ఈ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ తప్పనిసరిగా ధరించాలి. చేతులను తరచూ సబ్బుతో కడుక్కోవాలి లేదా శానిటైజర్ ఉపయోగించాలి. సుదూర ప్రయాణాలు, బహిరంగ గుంపులు, సమూహ సమావేశాలనుంచి దూరంగా ఉండాలి. కుటుంబ సభ్యులు, ముఖ్యంగా వృద్ధులు లేదా చిన్నపిల్లలు ఉంటే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

కోవిడ్ కొత్త వేరియంట్కు వ్యతిరేకంగా ప్రస్తుత టీకాలు ఎంతవరకు ప్రభావవంతంగా పనిచేస్తాయో పూర్తి స్పష్టత లేకపోయినా, వ్యాక్సినేషన్ వల్ల కొంత రక్షణ లభించేది మాత్రం నిజం. ఇప్పటికే చాలా మంది బూస్టర్ డోసులు తీసుకున్నప్పటికీ, ప్రస్తుతం ఎన్ బి .1.8.1 వంటి వేరియంట్లపై నిర్దిష్టంగా రూపొందించిన టీకాలు అందుబాటులో లేవు. అయినప్పటికీ, టీకాలు తీసుకున్న వారు తీవ్రమైన లక్షణాల నుండి బతికి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

పభుత్వాలు ప్రజలను అప్రమత్తం చేస్తూ, కరోనా పరీక్షలు ఎక్కువగా చేయాలన్న దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. విమానాశ్రయాల్లో తిరిగి థర్మల్ స్కానింగ్ ప్రారంభించబడింది. పాజిటివ్ కేసులున్నవారు ఐసోలేషన్లో ఉండేలా చూడటం, వారి కాంటాక్ట్లను గుర్తించి వారినీ పరీక్షించడం లాంటి చర్యలు మళ్లీ ప్రారంభమయ్యాయి. అదే సమయంలో, ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించి ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుకోవాలి.

కోవిడ్–19 మహమ్మారి 2019 చివరలో ప్రారంభమై 2021 చివరి వరకు ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ కాలంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆరోగ్య, ఆర్థిక, సామాజిక రంగాల్లో తీవ్రమైన సంక్షోభాలను ఎదుర్కొన్నాయి. ఇప్పుడు, 2025లో, కొత్త వేరియంట్లు ఎన్ బి .1.8.1 మరియు ఎల్ ఎఫ్ 7 భారతదేశం, సింగపూర్ వంటి దేశాల్లో వెలుగులోకి వచ్చాయి, ఇవి మళ్లీ కోవిడ్ కేసుల పెరుగుదలకు దారితీస్తున్నాయి. 2019 డిసెంబర్లో చైనాలోని వుహాన్ నగరంలో మొదటిసారిగా గుర్తించబడిన ఈ వైరస్, కొద్ది నెలల్లోనే ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి, 2020 మార్చిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని మహమ్మారిగా ప్రకటించింది. ఈ మహమ్మారి కారణంగా 2021 చివరి వరకు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మిలియన్లకు పైగా కేసులు, ఎన్నో మిలియన్ల మరణాలు నమోదయ్యాయి.

కోవిడ్–19 సోకిన వ్యక్తుల్లో కనిపించే లక్షణాలు వయస్సు, ఆరోగ్య స్థితిని బట్టి మారవచ్చు. ముందుగా తెలిసిన వేరియంట్లకు సాధారణంగా కనిపించే ప్రధాన లక్షణాలు %–% జ్వరం, పొడి దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీర నొప్పులు, వాసన కోల్పోవడం, రుచి కోల్పోవడం మొదలైనవి. కొన్ని సందర్భాల్లో విరేచనాలు, చర్మంపై ర్యాష్లు, కంటి ఎరుపు వంటి అసాధారణ లక్షణాలు కూడా తలెత్తవచ్చు. కాగా, తాజా వేరియంట్లలో లక్షణాలు మరింత మసకబారిపోయేలా మారుతున్నాయి. ఉదాహరణకు ఎన్ బి .1.8.1 వేరియంట్తో బాధపడుతున్నవారిలో సాధారణ జ్వరం, జలుబు లాంటి లక్షణాలతో పాటు, తీవ్రమైన అలసట, భూమి తేలినట్టు అనిపించడం, తలనొప్పి, కణతులు బాధపడటం లాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇది ముఖ్యంగా యువతలో ఎక్కువగా కనిపిస్తుండటం ఆందోళనకరం. వృద్ధుల్లో అయితే ఊపిరితిత్తులపై ప్రభావం ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది.

అలసట, నిద్రమత్తు, ఆకలి లేకపోవడం, ఒత్తిడి వంటి చిన్న లక్షణాలనూ అలసత్వంగా తీసుకోవడం ప్రమాదకరం. ఇవన్నీ కోవిడ్ ప్రారంభ దశల లక్షణాలే కావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ లక్షణాలు కనిపించినవారు వెంటనే కరోనా పరీక్షలు చేయించుకుని, ఇతరులతో సంబంధాలను తాత్కాలికంగా తగ్గించుకోవాలి.

మనం ఎక్కువగా చేరే ప్రదేశాలలో కూడా సామాజిక దూరం పాటించాలి. కనీసం 6 అడుగుల దూరం ఉంచటం ముప్పు స్థాయిలో ఉన్న వైరస్ ఆడకుండా అడ్డుకుంటుంది. సమూహాల్లో, వేడుకల్లో పెద్ద సంఖ్యలో కూడికలు నివారించాలి. కొంతవరకు వేడుకలు, సమావేశాలు వర్చువల్ మాధ్యమాల ద్వారా నిర్వహించడమే మంచిది. ప్రతి ఒక్కరూ తన ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి. ఒక చిన్న జ్వరం, దగ్గు, గొంతు నొప్పి ఉంటే వెంటనే దగ్గరి హెల్త్ సెంటర్ లేదా వైద్యుని సంప్రదించి టెస్టులు చేయించుకోవాలి. ఆలస్యం చేయడం వల్ల వైరస్ మరింతగా పంచబడే ప్రమాదం ఎక్కువ.

ఇక ముఖ్యంగా వయస్సు ఎక్కువైనవారు, క్రానిక్ రోగాలు ఉన్నవారు, గర్భిణీ స్త్రీలు మరింత జాగ్రత్తగా ఉండాలి. వీరు వైరస్ సోకితే తీవ్ర పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఎక్కువ. వీరి కోసం వృద్ధులకు ప్రత్యేక బూస్టర్ డోసులు అందించడం ప్రారంభమైంది. అందుకే టీకా తీరమని ఆప్యాయంగా సూచిస్తున్నారు. విభిన్న సందర్భాల్లో శుభ్రత కూడా చాలా కీలకం. ఇంట్లో, కార్యాలయంలో, ప్రయాణంలో స్పృహ గల మాస్కులు వేసుకోవాలి. దుస్తులు, చేతులు శుభ్రం ఉంచాలి. సాధారణంగా ప్రజల పొరుగున ఉన్నప్పుడు స్వచ్ఛతను ప్రాధాన్యం ఇవ్వాలి. కొన్ని సందర్భాల్లో వ్యాక్సిన్ తీసుకున్నా కూడా వ్యాధి సోకే అవకాశం ఉండే కారణంగా అప్రమత్తంగా ఉండటం మంచిది. కోవిడ్ వ్యాప్తి ఆపేందుకు ప్రభుత్వం పెట్టిన ఆదేశాలు, లాక్డౌన్, కర్ఫ్యూ లాంటి చర్యలు కూడా జాగ్రత్తగా పాటించాలి. చాలా మందిని చేరుకునే కార్యక్రమాలు, సభలు ఒకవేళ నిర్వహిస్తే, అన్ని ఆరోగ్య నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. ఈ వ్యాధి మనందరం కలసి తట్టుకోవాల్సిన సవాలు కావడం వల్ల అందరూ చురుకుగా ఉండటం అత్యంత అవసరం.

సమాజంలో మానసికంగా పీడితులవ్వడం మానుకోవాలి. ఎవరైనా కరోనా సోకితే వదిలిపెట్టకుండా సహాయం చేయాలి. సామాజిక మాధ్యమాల్లో, గుండె నిండా అపోహలు, తప్పు సమాచారం పంచుకోవడం వద్దు. ప్రభుత్వ, వైద్య మంత్రాల ప్రకటనలను మాత్రమే విశ్వసించి జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

అంతిమంగా, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం, మంచి ఆహారం, వ్యాయామం, విశ్రాంతి మంచిగా తీసుకోవడం వల్ల మన ఇమ్యూనిటీ పెరిగి కరోనా వైరస్తో పోరాటం మరింత సులభం అవుతుంది. కొవిడ్ను గెలవాలంటే ప్రతీ ఒక్కరూ తమ పాత్రను చక్కగా నిర్వర్తించాలి.

# ఆర్థిక కష్టాలు..అనవసర ఖర్చులు



పట్ట. హరి ప్రసాద్
8790843009

- కేసీఆర్ సర్కారు చేసిన అప్పులకు వడ్డీల చెల్లింపులు
- వాస్తవ పరిస్థితి అదే అయినా, ఇదో రాజకీయ ఎత్తుగడ
- ఈ క్రమంలో తామిచ్చిన హామీలను అమలు పై కనిపించని శ్రద్ధ
- అందాల పోటీలతో ప్రపంచపటంలో తెలంగాణ ఉంటుందన్న సర్కారు
- కానీ రోడ్లకు గుంతలు పూడ్చడానికి డబ్బుల్లేవంటున్న రేవంత్ సర్కార్

సీఎం రేవంత్ ఆర్థిక కష్టాల గురించి ఏదో ఒక సందర్భంలో గుర్తు చేస్తూనే ఉన్నారు. అధికారులు, మీడియా, ఉద్యోగ సంఘాలతో ఈ పరిస్థితికి కేసీఆర్ సర్కారు చేసిన అప్పులు, అందుకు తాము కడుతున్న వడ్డీలే అని పదే పదే దృష్టికి తెస్తున్నారు. వాస్తవ పరిస్థితి అదే అయినా, ఇదోరకం రాజకీయ ఎత్తుగడ. రాజకీయాల్లో విమర్శలు, ఆరోపణలు సాధారణమే.. అధికారంలోకి వచ్చాక పరిపాలన మాత్రం జరగాల్సిందే. తామిచ్చిన హామీలను అమలు చేసేందుకు సర్కారుకు వస్తున్న ఆమ్దానీ సరిపోవడం లేదు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ‘మమ్మల్నీ నమ్మడం లేదని’ సీఎం వాపోతుండు. రాష్ట్రం అప్పులు రూ. 8.15 లక్షల కోట్లపైగానే ఉం దని, కేంద్రం సహకరిస్తా లేదని అంటున్నారు. ఇన్ని ఆర్థిక ఇబ్బందుల్లో రూ. కోట్ల వ్యయంతో మిస్ వరల్డ్ అందాల పోటీల నిర్వహణ అవసరమా? అనే ప్రశ్నలు బయట పడుతున్నాయి. ప్రభుత్వ పథకాల అమలు, ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులు లేకుండా అందాల పోటీలకు కోట్లు వృథా ఎందుకనే సందేహం రావడం విధితమే. కేంద్ర సాయం ఎలాగూ లేదు. ఉన్న ఖజానాను సక్రమంగా ఖర్చుచేయ డంలో కొంత ఆచితూచి ఉండాలి కదా? అందాల పోటీలతో ప్రపంచ పటంలో హైదరాబాద్ చేరుతుందనీ, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయనీ, హైదరాబాద్ అభివృద్ధి చెందుతుం దని సర్కారు చెబుతున్నది. చాలామంది రైతుల ఖాతాల్లోకి డబ్బు చేరలేదు. ధాన్యం కోనుగోళ్లలో సగం రూ. మూడు వేల కోట్లే ఇచ్చింద్రు. గతేడాది జూన్ లో ఇవ్వాల్సిన పీఆర్సీ సంగతి పక్కనబెడితే, ఉద్యోగుల వేతనాల బకాయిలు, రకరకాల పెండింగ్ బిల్లుల పేర రూ. 9200 కోట్ల మేర పేరుకు పోయింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైంది. ప్రతినెలా రూ. 6500 కోట్ల ఆదాయ లోటు. బిల్లుల్లో వేటిని ఆపాలో, వేటిని ఇవ్వాలో సర్కారుకు తెలియని పరిస్థితి. ఇదిలావుంటే కేంద్ర మంత్రి బండి సంజయ్ రాష్ట్రం లో రూ. 12 లక్షల కోట్ల అభివృద్ధి పనులు చేసినట్టు ఇటీవల నితిన్ గడ్కరీ టూర్ లో చెప్పింద్రు. అదే జరిగి ఉంటే, రోడ్లకు గుంతలు పూడ్చ డానికి డబ్బుల్లేవని సీఎం రేవంత్ ఎలా అన్నారు. ఇద్దరి మాటలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. దేశంలోని అన్నీ రాష్ట్రాల్లో కల్లా జీఎస్టీ, ఇతర పన్నులను కేంద్రానికి అత్యధికంగా చెల్లిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటి. కాగా రాష్ట్రానికి మాత్రం కేంద్రం సాధారణంగా వచ్చే నిధులను సైతం అడ్డుకోవడం, ఆలస్యం చేయడం, తగ్గించడం చేస్తున్నది. కనీసంగా దాదాపు రూ. 50 వేల కోట్లు పెండింగ్లో పెట్టినట్లు తెలుస్తోంది. జాతీ య రహదారుల నిర్మాణ పనుల బిల్లులు నెలల తరబడి ఆలస్యం చేస్తు న్నది. స్మార్ట్ సిటీల పేర హడావిడే తప్ప రాష్ట్రాలపై కనికరం లేదు. దేశవ్యాప్తంగా సర్కారు స్కూల్లలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం పీఎం పోషణ్ పర్యవేక్షణా లోపం, నిధులు లేక నీరుగారి పోతున్నది. దీనికి రూ. 307 కోట్లు కావాల్సి ఉంటే, రాష్ట్ర వాటా కింద రూ. 115 కోట్లు కట్టాలని తెలంగాణకు హుకుం జారీచేయడం గమనార్హం. నిధుల కోసం, రాష్ట్రాల హక్కుల కోసం కలిసొచ్చే కేరళ, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఇతర రాష్ట్రాలతో కలిసి పోరాటం చేయడమే రేవంత్ సర్కార్ కు ముందున్న మార్గం.

# మతానికి శత్రువు మానవుడే

మానవ నాగరికత అభివృద్ధి పరిణామ క్రమంలో అనివార్యంగా మతాన్ని, దేవుడిని సృష్టించుకోవాల్సిన అవసరత నాటి మానవుడికి ఏర్పడింది అనే విషయం జగమెరిగిన సత్యం. విశ్వాన్ని ఏ దేవుడు సృష్టించలేదు పంచ భూతాల పరివర్తన క్రమంలో విశ్వ అభివృద్ధి నాటి ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక సమాజం వరకు దశలవారీగా అభివృద్ధి చెందుతూ వస్తున్నది. అయితే ఆనాటి ప్రాచీన అనాగరిక సమాజంలో మానవ అభివృద్ధి పరివర్తన క్రమంలో భాగంగా ప్రకృతి ధర్మాల ప్రకారం ఏర్పడిన భయభ్రాంతులను నుండి తమను తాము రక్షించుకోవడానికి మరియు స్వీయ క్రమశిక్షణతో కూడిన ఉన్నతమైన జీవితాన్ని గడపడానికి మానవుడు మతాన్ని, దేవుడిని సృష్టించాడు. అందులో భాగంగానే నేటి ఆధునిక సమాజం లో అనేక మతాలు, దేవతా, దేవుళ్ళు మానవుడి చేత సృష్టించబడినయి. అందులో ప్రధానంగా నేడు ఆధునిక సమాజంలో మెజార్టీగా ఆచరణలో ఉన్న మతం జీసస్ తీసుకొచ్చిన క్రైస్తవ మతం, రెండవ స్థానంలో మహమ్మద్ ప్రవక్త తీసుకొచ్చిన ముస్లిం మతం, బుద్ధుడు విలువల చేత ఆచరణలో ఉన్న బౌద్ధం, ఇక భారతదేశ విషయానికి వస్తే మెజార్టీగా విశ్వసించేది హిందూ మతం. ఐతే ఏ మత దేవుళ్ళు కూడా స్వేచ్ఛ సమానత్వ సోదరభావ విలువలతో కూడిన మానవుడి మనుగడ ఉన్నతంగా ఉండాలని అయా మత సృష్టికర్తలు మంచిని మాత్రమే బోధించరు తప్ప, మానవ మనుగడకె ప్రమాదం వచ్చేలా ఏ మత సృష్టికర్త కూడా అతివాదా, తీవ్రవాద నియమ నిబంధనలను అయా మతాలలో జోడించలేదు. కానీ నేటి ఆధునిక సమాజంలో ఏ ఉద్దేశంతో అయితే మానవుడి చేత మతం కనిపెట్టబడినదో ఆ విలువలపై మతాన్ని అనుసరించకుండా ప్రకృతి నియమాలకు పూర్తి విరుద్ధంగా మత విలువలని అతివాద, తీవ్రవాద సిద్ధాంతాలతో కలుషితం చేసుకొని చివరికి మానవ మనుగడకె ప్రమాదం కొనితెచ్చుకున్నారు. నేడు మతం మత్తులో ఉన్న ఆధునిక మానవుడు ఎలా తయారయ్యాడు అంటే మానవ మనుగడ ముఖ్యమా, మతం ముఖ్యమా అంటే..? మతమే ముఖ్యం అనేలా ప్రకృతి నియమాలకు విరుద్ధంగా పరివర్తన చెందుతూ నిర్మాణం అవుతున్నారు. కానీ ప్రపంచంలో ఎక్కువ మంది చేత ఆచరణలో ఉన్న క్రైస్తవ మత స్థాపకుడు ఐన జీసస్ నాడు తనని శిలువకి కట్టి చేతులకి, కాళ్ళకి, తలకి ఇనుప మోలలతో కొట్టి కిరాతకంగా హింసించిన జీసస్ మాత్రం అజ్ఞానంలో అమాయకత్వంతో అంధకారంలో ఉండి తనను హింసిస్తున్న వ్యక్తులకి మంచి జరగాలని కోరుకున్నాడు తప్ప, చెడు జరగాలని భావించలేదు. అలాగే ప్రపంచంలో అనేకమంది మానవులచే విశ్వసించబడుతున్న రెండవ స్థానంలో ఉన్న ముస్లిం మత స్థాపకుడు ఐన మహ్మద్ ప్రవక్త కూడా ఇస్లాం(ముస్లిం) మతాన్ని విశ్వసించే వారి కంటే ఇస్లాం మతాన్ని స్వీకరించని వారిని కూడా ప్రేమ కరుణ ఆప్యాయతతో పలకరించాడు, ఎందుకంటే ఏనాటికైనా మానవులు పరివర్తన చెంది వారి ఇష్టానుసారమే ఇస్లాం మతాన్ని స్వీకరిస్తారాని విశ్వసించాడు. ఇక భారతదేశంలో అనేకమంది చేత విశ్వసించబడుతున్న మెజార్టీ మతమైన హిందూ మతంలో కూడా విశ్వ మానవులందరినీ ప్రేమించే స్వేచ్ఛ సమానత్వ సోదరభావ విలువలతో కలిగిన భిన్నత్వంతో కూడిన ఏకత్వ భావాలు ఉండి సాటి మనుషుల పట్ల మానవత్వాన్ని బోధించే అంశాలే ఉన్నాయి. కానీ నేటి ఆధునిక సమాజంలో మతం మత్తులో మునుగుతూ తీవ్రవాద భావాలు కలిగిన పాకిస్తాన్ దేశానికి చెందిన టెర్రరిస్టులు చేసిన దాడిలో తాజాగా భారతదేశ ప్రాంతానికి చెందిన పహల్గంలో దాదాపుగా 26 మంది భారతీయులు మరణించారు. అయితే ఈ సంఘటనలో పాకిస్తాన్ కేంద్రంగా తీవ్రవాదులుగా మారిన వ్యక్తులు హిందూ పురుషులని లక్ష్యంగా చేసుకొని కిరాతకంగా చంపివేయడం భారతదేశాన్ని మాత్రమే కాదు, ప్రపంచం మొత్తాన్ని భయ భ్రాంతులకి గురి చేసింది. పహల్గం దాడి సంఘటనకి బదులుగా భారతీయ వాయు సైన్యం కూడా పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి దాదాపు 100 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చమని భారతీయ కేంద్ర ప్రభుత్వం కూడా చెప్పడం జరిగింది. పహల్గం దాడి సంఘటనపై లోతుగా ఆలోచిస్తే ముస్లిం మత విలువలకి విరుద్ధంగా నిర్మాణమైన కొందరు తీవ్రవాదులు అతివాద భావాలు కలిగి మతం పేరుతో, అల్లా పేరుతో, జిహాద్ పేరుతో మెజార్టీగా హిందూ మతాన్ని విశ్వసించే భారతదేశం పై ఉన్న అసూయ, శత్రుత్వంతో భారతీయుల పై అనేక సందర్భాల్లో దాడి చేస్తూనే ఉన్నారు. పాకిస్తాన్ కి చెందిన ఉగ్రవాదులు చేసిన పహల్గం దాడికి, బదులుగా భారతీయ ప్రభుత్వం చేసిన దాడిని కూడా హిందూ మత పురుషులపై చేసిన దాడికి ప్రతిదాడిగా ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలని భస్మం చేయడం జరిగింది. అంటే ఇక్కడ భారతీయులపై జరిగిన దాడికి ప్రతిదాడులు చేసినం అని చెప్పుకోకుండా పాకిస్తాన్ కి చెందిన ముస్లిం తీవ్రవాదులు చేసిన దాడికి ప్రతిదాడిగా హిందూ మతం నుండి విశ్వసిస్తున్న వ్యక్తులుగా ప్రతిదాడి చేశాం అని భారత ప్రభుత్వం అనివార్యంగా చెప్పుకోక తప్పని పరిస్థితి నెలకొన్నది. పహాల్గం దాటి తర్వాత జరిగిన పరిణామ క్రమం చూస్తే మూడో ప్రపంచ యుద్ధం జరగబోతున్నదా అనే దోరణిలో చాలామంది భారతీయులు మరియు వివిధ ప్రపంచ దేశాలు భావించాయి. ఈ పహల్గం సంఘటన నుండి భారతదేశం మాత్రమే కాదు, ప్రపంచ దేశాలన్ని కూడా గ్రహించాల్సిన సత్యం ఏంటంటే అయా మతాల నుండి ఆవిర్భవిస్తున్న అతివాద, తీవ్రవాద సంస్థల నుండి చివరకు అయా మతాలకి, మానవ మనుగడకి ప్రమాదం జరుగుతున్నది. అంతేకాదు మానవుడి చేత కనిపెట్టబడిన మతమే మానవుడికి శత్రువై ఉన్నదని నిరూపితం అవుతున్నది. కాబట్టి మానవ మనుగడ ఎల్లకాలం కొనసాగాలి అంటే ఏ మతాన్ని విశ్వసించే వారు ఐన ప్రాథమికంగా మానవ ఉనికికి ప్రాముఖ్యత ఇచ్చి, ఆ తర్వాతనే మతానికి రెండో ప్రాముఖ్యత ఇవ్వాల్సిన చారిత్రక అవసరత ఉన్నది. లేకుంటే మతం పేరుతో, దేవుళ్ళ పేరుతో యుద్ధాలు చేసుకుంటే అంతిమంగా నాశనం అయ్యేది మానవుడే అని నేడు ప్రపంచంలో ఉన్న అయా దేశ ప్రభుత్వాలని నడుపుతున్న పాలకులు గ్రహించాల్సిన సత్యం. ఎందుకంటే మానవుడి కోసం మతం ఉండాలి తప్ప, మతం కోసమే మానవుడు పోరాటం చేయకూడదు. ఒకనాడు ఉన్నతమైన జీవితాన్ని, క్రమశిక్షణ జీవితాన్ని గడపడానికి మతాన్ని సృష్టించుకున్న మానవుడు నేడు అదే దేవుళ్ళ మతం మత్తులో పడి అసలైన మత విలువల మార్గంలో వెళ్లకుండా, అయా మత విలువలకు విరుద్ధమైన మార్గంలో ప్రయాణించడం అంటే బుద్ధిజీవి ఐన మానవడు బుద్ధిహీనుడైన క్రూర మృగాలతో సమానమైన జీవిత మారుతున్నాడని చెప్పని తప్పని పరిస్థితి. నాటి ప్రాచీన మానవ ఆదిమ యుగంలో క్రూర మృగల నుండి రక్షణ కోసం వివిధ ఖనిజాల నుండి ఆయుధాలను తయారు చేసుకున్న మానవుడు నేడు సాటి మానవుల నుండి రక్షణ పొందడానికి భయంకరమైన మరణాయుధాలు తయారు చేసుకోవడం అంటే ఆధునిక సమాజంలో బ్రతుకుతున్నామని చెప్పుకోవాలా లేకుంటే మానవ అభివృద్ధి తిరోగమన దారిలో ప్రయాణం చేస్తుందని చెప్పుకోవాలా అనేది లోతుగా ఆలోచించాల్సిన విషయం. కాబట్టి ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఏర్పడిన ఐక్యరాజ్య సమితి కూడా నేడు యుద్ధ ప్రాతిపదికన అన్ని దేశాల అధిపతులని ఒకే వేదికపై కూర్చోబెట్టి ఉమ్మడి కార్యచరణలో భాగంగా మానవ మనుగడని ప్రమాదంలో నెట్టివేసే ఉగ్రవాద సంస్థల పై ఐక్యంగా పోరాటం చేసి, మళ్లీ ఏ ఒక్క ఉగ్రవాద సంస్థ కూడా ఏ మతం నుండి పుట్టకుండా బలమైన సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరత ఉన్నది. మారణహోమం సృష్టించే రక్షణ ఆయుధాలు అవసరం లేని స్వేచ్ఛగా సమానత్వంతో సోదరభావంతో ప్రపంచ దేశాలన్నీ కూడా వాణిజ్యం చేసుకునేలా మతం కేంద్రంగా కాకుండా, మనిషి కేంద్రంగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావాల్సిన బాధ్యత నేడు ఐక్య రాజ్యసమితి పై, అన్ని దేశాల అధిపతులపై ఉన్నది. అంతిమంగా అయా దేశ ప్రభుత్వాల పాలనలో కొన్ని వైఫల్యాలు ఉన్న ప్రభుత్వల బాధ్యతల కంటే సామాజిక, నైతిక బాధ్యత ముఖ్యం కాబట్టి ప్రతి మానవుడు మతం, దేవుడిని రెండో ప్రాధాన్యతగా చూస్తూ, మొదటి ప్రాధాన్యత మానవత్వానికి, మానవ మనుగడకి ఇవ్వాల్సిన అనివార్యత, బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉన్నదనే విషయాన్ని గుర్తు ఎరగి సాటి మనుషుల పట్ల ప్రేమ ఆప్యాయత కరుణ విలువలు కలిగి ఉండాలి, అదే అయా మత సృష్టికర్తలు బోధించిన విలువలు. ఏ మతస్తులైన మత సృష్టికర్తలు, మత పెద్దలు బోధించిన విషయాన్ని సాటి మానవుడికి ఇబ్బంది కలగకుండా శాంతియుత మార్గంలో పాటించడమే అయా మత సృష్టికర్తలకి, దేవుళ్ళకి ఇచ్చే నిజమైన గౌరవం. ఇదే నేటి ఆధునిక సమాజంపై ఉన్న అతి పెద్ద బాధ్యతతో కూడిన ధర్మం అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాల్సిన చారిత్రక సత్యం.

బి పుల్లెంల గణేష్
9553041549

## జ్యోతి మల్హోత్రాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ..

న్యూఢిల్లీ : పాకిస్థాన్ నిఘా సంస్థలకు భారత్ కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా ను హిస్సార్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసుపై విచారణ జరిపిన హరియాణాలోని కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అంతకుముందు నాలుగు రోజుల పాటు జ్యోతి పోలీసుల కస్టడీలో ఉంది. గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలతో ఈ నెల ప్రారంభంలో పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్కు చెందిన 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో జ్యోతి కూడా ఒకరు. అయితే దర్యాప్తులో ఆమెకు పాకిస్థాన్కు చెందిన ఉన్నతాధికారులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించడంతో మొదట ఐదు రోజుల పాటు పోలీస్ రిమాండ్కు పంపారు. అనంతరం మే 22న కోర్టు ముందు హాజరుపరిచారు. ఆమెను మరికొన్ని రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు న్యాయస్థానాన్ని కోరడంతో.. వారి వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు 4 రోజుల పాటు ఆమెకు రిమాండ్ విధించింది. కస్టడీ నేటితో ముగియడంతో మరోసారి కోర్టులో హాజరుపర్చగా ప్రస్తుతం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్ జో పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తోంది. 2023లో పాక్కు వెళ్లిన సమయంలో ఆమెకు పాక్ హైకమిషన్ ఉద్యోగి అయిన డానిష్తో పరిచయమైంది. అనంతరం ఆమె ఆ దేశ గూఢచర్య సంస్థ ప్రతినిధులతో టచ్లోకి వెళ్లినట్లు తెలిసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ జ్యోతి.. డానిష్తో మాట్లాడినట్లు సమాచారం. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు కూడా ఆమెను ప్రశ్నించారు. విచారణలో జ్యోతి మల్హోత్రాకు ఉగ్రవాదులతో సంబంధం ఉన్నట్లు, ఉగ్ర కార్యకలాపాల్లో పాలుపంచుకున్నట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేవని పోలీసులు పేర్కొన్నారు. అయితే, ఆమె పూర్తి స్పృహతోనే పాకిస్థానీ ఇంటెలిజెన్స్ అధికారులతో సంప్రదింపులు కొనసాగించిందని అన్నారు.



# పాక్ ఏకైక లక్ష్యం భారత్‌తో శత్రుత్వమే

- మన త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చాం
- ప్రపంచం చూడని విధంగా అద్భుతాలు సృష్టించారు
- నుదిట సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశాం
- గుజరాత్ భుజ్లో జరిగిన ర్యాలీలో మోడీ వ్యాఖ్య
- రూ.83వేల కోట్ల తో చేపట్టే పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు

లక్నో : ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ప్రతీకారదాడులకు ప్రయత్నించగా, భారత సైన్యం వాటిని తిప్పికొట్టినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దేశ విభజన తర్వాత ఏర్పడిన పాకిస్థాన్ భారత్తో శత్రుత్వమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆరోపించారు. గుజరాత్ పర్యటనలో భాగంగా దోహద్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరం గ సభలో పాల్గొన్న ప్రధాని మోదీ పాకిస్థాన్పై విరుచుకుపడ్డారు.



మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచిపెట్టిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. ఈ సందర్భంగా మరొక సారి పాకిస్థాన్కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సిందూర్ అనేది వివాహానికి సంకేతమని.. దానిని తుడిచివేయడం అంటే వైధవ్యాన్ని సూచిస్తుందన్నారు. మన సోదరీమణుల నుదిట నుంచి దాన్ని తుడిచేసే ధైర్యం చేసిన వాళ్లను ఖతం చేశామని చెప్పారు. ఇక మోడీని ఢీకొట్టడం ఎంత కష్టమో ఉగ్రవాదులు కూడా కలలో ఊహించి ఉండకపోవచ్చన్నారు. మన త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని.. దీంతో ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచం చూడని విధంగా అద్భుతాలు సృష్టించారని ప్రశంసించారు.

'విభజన తర్వాత ఏర్పడిన పాకిస్థాన్ ఏకైక లక్ష్యం భారత్తో శత్రుత్వం. భారత్ అంటే ద్వేషంతో మన దేశానికి హాని కలిగించాలనే తపనే ఉంటుంది. కానీ, భారత్ లక్ష్యం పేదరికాన్ని నిర్మూలించటం. ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయటం. అభివృద్ధి చెందటం. దేశ సైన్యం బలంగా ఉన్నప్పుడే వికసిత్ భారత్ సాధ్యమవుతుంది. అప్పుడు మన ఆర్థికవ్యవస్థ బలంగా ఉంటుంది' అని ప్రధాని మోదీ అన్నారు. అంతేకాకుండా 2014లో ఇదే తేదీన ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారని గుర్తు చేసుకున్నారు.

దోహద్లో దాదాపు రూ.24వేల కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రైల్వే లోకోమోటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్తోపాటు 9వేల హార్స్పవర్ సామర్థ్యం కలిగిన దేశంలోనే తొలి లోకోమోటివ్ ఇంజిన్ను ప్రారంభించారు. రెండు రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ దోహద్, భుజ్, గాంధీనగర్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. దాదాపు రూ.83వేల కోట్లతో చేపట్టే వేర్వేరు అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

**ప్రధాని మోదీపై పూల వర్షం :** అంతకు ముందు పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ రోడ్షో నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి గుజరాత్ పర్యటనకు వచ్చిన ప్రధానికి ఘనస్వాగతం లభించింది. వడోదర విమానాశ్రయం నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న వైమానిక కేంద్రం వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై స్థానికులు పూలవర్షం కురిపించారు. ప్రధాని మోదీ కాన్వాయ్ సాగుతుంటే ప్రజలు తివర్ణ పతాకాలను చేతబూని సైన్యానికి అనుకూలంగా నినాదాలు చేశారు. ప్రధాని రోడ్షోలో అంతర్జాతీయ విద్యార్థులతోపాటు ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన కర్నల్ సోఫియా ఖురేషి తల్లిదండ్రులు, సోదరుడు మహ్మద్ సంజయ్ ఖురేషి, సోదరి స్యానా సున్నారా పాల్గొన్నారు.








ఉగ్రస్థావరాలపై దాడి తర్వాతే

# పాక్‌కు సమాచారం

## - కాంగ్రెస్ ఆరోపణలపై జైశంకర్ క్లారిటీ



న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ దాడులు గురించి పాకిస్థాన్కు ముం దే సమాచారం ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడింది. ఉగ్రస్థావరాలపై దాడులు పూర్తయ్యాకే పాకిస్థాన్కు సమాచారం అందించామని తెలిపిం ది. ఈ మేరకు విదేశాంగ శాఖకు చెందిన కాన్సులేటీవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశం సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టతనిచ్చారు.

**'దేశం మొత్తం ఒక్కతాటిపై నడవాలి'**

"ఆపరేషన్ సిందూర్లో ఉగ్ర స్థావరాలపై దాడులు పూర్తయ్యాకే పాకిస్థాన్కు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)కు సమాచారం అందించాం. అప్పటికే ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో కూడా ప్రకటన విడుదలైంది. ఎంపీల బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో పర్యటిస్తున్నాయి. అందుకే దేశం మొత్తం ఒక్కతాటిపై నడవాలి" అని జైశంకర్ అభ్యర్థించారు. ఆపరేషన్ సిందూర్ పాక్ దళాల విశ్వసనీయత, నైతికతను దెబ్బతీసిందని జైశంకర్ చెప్పారు. ఉగ్రవాదంపై భారత వైఖరిని మూడు దేశాల తప్ప మిగిలిన దేశాలు విమర్శించలేదని ఆయన పేర్కొన్నారు. భారత్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రపంచ దేశాలు ప్రశంసించాయని వెల్లడించారు. ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ కంటే ముందే పాక్ చెప్పినట్లు కాంగ్రెస్ ప్రచారం చేయడం వాస్తవాలను వక్రీకరించడమేనని ఆయన వ్యాఖ్యానించినట్లు సీఎన్బీసీ-న్యూస్18 కథనంలో పేర్కొంది. అయితే పాకిస్థాన్ సమాచారం విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఇస్లామాబాద్కు ముందుగానే ఆపరేషన్ విషయం చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు కాన్సులేటీవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశంలో జైశంకర్ స్పందించినట్లు ఉన్నారు. దాడుల తర్వాతే %ణ+మీా% స్థాయిలో పాక్ సంభాషించినట్లు వెల్లడించారు.

# సౌత్ కరోలినాలో కాల్పుల కలకలం..

## 11 మందికి గాయాలు

కరోలినా : అమెరికాలోని దక్షిణ కరోలినాలో కాల్పులు చోటుచేసుకున్నాయి. లిటిల్ రివర్ ప్రాంతంలో ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు ఈ దారుణానికి తెగబడ్డారు. దీంతో ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రజలు పరుగులు పెట్టారు. ఈ దాడిలో 11మంది గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించినట్లు హారీ కౌంటీ పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర విభాగాలు ఘటనాస్థలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాయి. భారీ సంఖ్యలో అంబులెన్సు అక్కడికి చేరుకున్నాయి. నివాస సముదాయాల మధ్య ఎవరు కాల్పులు జరిపారనే విషయాలు తెలియాల్సి ఉందని.. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఇటీవల సౌత్ కరోలినాలో అరాచకశక్తుల ఆగడాలు విపరీతంగా పెరిగిపోయాయి. గతనెలలో ఇదే విధంగా దక్షిణ కరోలినాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన మిర్టిల్ బీచ్లో దుండగులు కాల్పులకు పాల్పడడంతో ఓ వ్యక్తి మరణించగా.. 11మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో ఘటనలో నార్త్ ఓషన్ బౌలేవార్డ్లో ఓ వ్యక్తి ప్రజలపై ఒక్కసారిగా కాల్పులకు తెగబడడంతో పలువురు గాయపడ్డారు. పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో అతడు మ-రణించినట్లు అధికారులు పేర్కొన్నారు.




# మరోసారి కరోనా పంజా

- ఒమళ్లీ ప్రజలలో మెదలైన కలవరం
- ఢిల్లీలో 104 క్రియాశీల కేసులు..
- 400 పైగా కేసులతో మొదటిస్థానంలో కేరళ
- ఆసియా దేశాలలోనూ నమోదవుతున్న వేలాది కేసులు



న్యూఢిల్లీ : దేశంలో మరోసారి కరోనావైరస్ కలకలం సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఢిల్లీలో ప్రస్తుతం 104 మంది వైరస్తో బాధపడుతున్నారు. ఒక వారంలోనే 99 మంది దీని బారినపడటం ఆందోళన కలిగిస్తోంది. కేరళలో కేసుల సంఖ్య 400 దాటింది. దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 1009గా ఉండగా.. వారం వ్యవధిలో 750 మందికి కొత్తగా కరోనా సోకిందని సోమవారం ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఇటీవల ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్లాండ్తో పాటు చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడించారు. అవే ఉపరకాలను భారత్లో గుర్తించినట్లు ఇటీవల ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం గత వారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

**రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..**

కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా ఉన్నాయి. కేరళలో అత్యధికంగా 430 క్రియాశీల కేసులు ఉండగా.. మహారాష్ట్ర (209), ఢిల్లీ (104), గుజరాత్ (83), తమిళనాడు (69), కర్ణాటక (47), ఉత్తరప్రదేశ్ (15), రాజస్థాన్ (13), పశ్చిమబెంగాల్ 12, పుదుచ్చేరి 9, హరియాణా 9, ఏపీ 4, మధ్యప్రదేశ్ 2, తెలంగాణ, గోవా, ఛత్తీస్గఢ్లలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. తాజాగా బిహార్లో ఒక కేసు నమోదైనట్లు సమాచారం. అయితే, కేసులు నమోదవుతున్నప్పటికీ.. తీవ్రత తక్కువేనని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపిన సంగతి తెలిసిందే కొత్తగా కరోనా సోకిన వారిని విశ్లేషించగా రెండు కొత్త వేరియంట్లుఎన్బి.1.8.1, ఎల్ ఎఫ్ .7ను గుర్తించారు. ఈ రెండు కొత్త వేరియంట్లపై ప్రపంచ ఆరోగ్య సంస్థపై కూడా స్పందించింది. ఈ రెండు కొత్త వేరియంట్లు తమ పరిశీలనలో ఉన్నట్లు పేర్కొంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది.

కరోనా కేసుల పెరుగుదలతో దేశంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయితే, ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం ఇన్ఫెక్షన్ రేటు తక్కువగా ఉందని, ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం చాలా తక్కువగా ఉంటోందని చెప్పింది. వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఈ క్రమంలోనే శనివారం కొవిడ్ పరిస్థితులపై కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పలు రాష్ట్రాలతో సమీక్ష నిర్వహించారు. ఇందులో కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక ఉన్నట్లు అధికారా వర్గాలు చెప్పాయి.

# పాక్‌తో గూఢచర్యం

## సీఆర్పీఎఫ్ జవానును అరెస్టు




న్యూఢిల్లీ: దేశానికి సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులకు చేరవేస్తున్న సీఆర్పీఎఫ్ జవాను ఒకరిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అరెస్టు చేసింది. నిందితుడిని మోతీ రామ్ జాట్గా గుర్తించింది. మోతీరామ్ జాట్ 2023 నుంచి జాతీయ భద్రతకు సంబంధించిన క్లాసిఫైడ్ సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులకు చేరవేస్తూ గూఢచర్యం చేస్తున్నట్టు ఎన్ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది. పీఐఓల నుంచి వివిధ మార్గాల ద్వారా అతను నిధులు అందుకుంటున్నట్టు కూడా గుర్తించామని పేర్కొంది. మోతీరామ్ జాట్ను ఢిల్లీలో అరెస్టు చేసి ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. దేశ రక్షణలో బలగాల పాత్ర కీలకమైనదని, దేశ భద్రతను పణంగా పెట్టి గూఢచర్యానికి పాల్పడటం తీవ్రంగా పరిగణించాల్సిన వ్యవహారమని కోర్టు ఈ సందర్భంగా పేర్కొంది. జూన్ 6 వరకూ నిందితుడిని ఎన్ఐఏ కస్టడీలోకి తీసుకోవాలని ఆదేశించింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత బలగాలు పాక్, పీఓకేలోని ఉగ్రస్థావరాలపై మెరుపుదాడి దాడి చేయడం, అనంతరం పాక్ బలగాలు ప్రతిదాడులకు దిగడంతో భారత్ ఆ దాడులను తీవ్రంగా తిప్పికొట్టిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశంలోని అనుమానాస్పద గూఢచారులపై చర్యలకు తీసుకోవాలని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలోనే పాక్ కోసం గూఢచర్యం చేస్తున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను ఇటీవల అరెస్టు చేశారు. ఈనెలలోనే పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ నుంచి గూఢచర్యం ఆరోపణలపై 12 మందిని అరెస్టు చేశారు.

# 31 వరకు భారీ వర్షాలు

## ముంబయి, ఢిల్లీని ముంచెత్తిన వానలు

### కొన్ని రాష్ట్రాల్లో స్కూల్స్ బంద్ - పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



ఢిల్లీ : నైరుతి రుతుపవనాలు సమయానికి కంటే ముందుగా రావడం వల్ల పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. శనివారం ఢిల్లీలో బీభత్సం సృష్టించగా, ఆదివారం అర్ధరాత్రి మహారాష్ట్రలో భారీగా వర్షపాతం నమోదైంది. మరోవైపు కేరళ, కర్ణాటకలో స్కూల్స్, కాలేజీలకు సెలవు ప్రకటించారు. ఇదిలా ఉండగా మే31 వరకు పలు రాష్ట్రాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. నైరుతి రుతుపవనాలు సమయం కంటే ముందుగా కేరళ తర్వాత మహారాష్ట్రకు చేరుకున్నాయి. 35సంవత్సరాల తర్వాత రుతుపవనాలు ముందుగా రావడం ఇదే మొదటిసారి. దీంతో ముంబయి, పుణేలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి కురిసిన బారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలోని అనేక ప్రాంతాలు జలమయ్యాయి. రోడ్లు నదులను తలపిస్తున్నాయి. ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. అప్రమత్తమైన అధికార యంత్రాంగం వెంటనే సహాయక చర్యలు చేప్ట టింది. అయితే రానున్న కొద్ది గంటల్లో ముంబయిలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుం చి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది. రాయ్గఢ్, రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాలలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. భారీ నుంచి అతీ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. ముంబయి, థానే, పాల్ఘర్, మరికొన్ని జిల్లాల్లో ఎల్లో అలర్ట్ అమల్లో ఉంది.

**స్కూల్స్, కాలేజీలకు సెలవు :** మరోవైపు కర్ణాటకలో కూడా ఆదివారం మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో కర్ణాటకలోని తీర ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు. మరోవైపు వర్షాలు కారణంగా మైసూరు కొడుగు జిల్లాలో స్కూల్స్, కాలేజీలకు సెలవు ప్రకటించారు. మే 31 వరకు కర్ణాటకలోని పలు జిల్లాలో 50-60 కి.మీ. వేగంతో గాలులు వీస్తూ భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. అటు కేరళలోనూ 11 జిల్లాలకు రెడ్ అల్టర్, మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. దీంతో కేరళ ప్రభుత్వం త్రిస్సూర్, ఇడుక్కి, ఎర్నాకుళం, వయనాడ్, కాసర్గోడ్ జిల్లాల్లోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిది. కేరళ, తమిళనాడు, మహేలో మే 29వరకు అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో రానున్న ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఛత్తీస్గఢ్, అండమాన్, నికోబార్ దీవుల్లో మే 27 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. ఒడిశా, ఝార ండ్, బంగాల్, సిక్కిం, బిహార్ రాష్ట్రాల్లో మే 31వరకు గంటకు 40-50కిలోమీటర్ల ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

**ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు**

రానున్న ఏడు రోజుల్లో ఈశాన్య రాష్ట్రాల్లో గంటకు 30-40కిలోమీటర్ల గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. మే 28,29 తేదీల్లో నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపురలో, మే30,31 తేదీల్లో అసోం, మేఘాలయలో అతీ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

# జడ్జి నోట్ల కట్టల వ్యవహారం... లేఖ బహిర్గతం చేయలేం



న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ 'నోట్ల కట్టల' వ్యవహారంలో ఇవాళ కీలక మలుపు చోటు చేసుకుంది. కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ రూపొందించిన నివేదికను బహిర్గతం చేయడం కుదరదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.ద జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న టైంలో ఆయన అధికారిక బంగ్లాలో అగ్నిప్రమాదం చోటు చేసుకోగా.. మంటలర్పిన ఫైర్, పోలీస్ పోలీస్ సిబ్బందికి కాలిన నోట్ల కట్టలు కనిపించడం, ఆ వ్యవహారం బయటకు పొక్కడం సంచలనంగా మారింది. ఈ వ్యవహారంపై కోర్టు నియమించిన కమిటీ విచారణ జరిపి నివేదికను అందజేసింది కూడా. అయితే..

అందులో విషయాలను బహిర్గతం చేయాలంటూ ఆర్టీఐ వ్యవస్థ ద్వారా న్యాయస్థాన సమాచార అధికారికి దరఖాస్తు అందింది. అయితే సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఈ దరఖాస్తును తిరస్కరిస్తూ.. ఆర్టీఐ యాక్ట్లోని సెక్షన్ 8(1)(%వ%) కింద సమాచారం అందించలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో 2019 సంచలన తీర్పును న్యాయస్థానం ప్రస్తావించింది. సుభాష్ చంద్ర అగర్వాల్ కేసులో.. రాజ్యాంగ పరిధిలో గోప్యత హక్కు, సమాచార హక్కు ఈ రెండింటి సమతుల్యత అవసరమని కోర్టు వ్యాఖ్యానించింది.

మార్చి 14వ తేదీన జడ్జి ఊళ్లో లేని టైంలో బంగ్లాలో ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుని కాలిన నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో ఆరోపణలు రావడంతో ఆయన్ని అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అయితే అలహాబాద్ బార్ అసోషియేషన్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో.. బదిలీ చేసినప్పటికీ విధులేవీ ఆయనకు అప్పగించలేదు.

అంతేకాదు.. మునుపెన్నడూ లేని రీతిలో ఆ ఇంట్లో బయటపడ్డ నోట్ల కట్టల ఫొటోలు, వీడియోలను సుప్రీం కోర్టు తన వెబ్సైట్లో అప్లోడ్ చేసి ఆసక్తికర చర్చకు దారి తీసింది. అటుపై మార్చి 22వ తేదీన జడ్జి వర్మ నోట్ల కట్టల వ్యవహారంపై అంతర్గత విచారణకు ముగ్గురు జడ్జిలతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మే 3వ తేదీన తుది నివేదిక రూపొందించగా.. ఆ మరుసటి రోజు ఆనాడు సీజేఐగా ఉన్న సంజీవ్ ఖన్నాకు నివేదిక అందజేసింది. దానిని సీజేఐ ఓ లేఖ ద్వారా రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి తెలియజేశారు. మరోవైపు తనపై వస్తున్నవి కేవలం ఆరోపణలేనని జస్టిస్ వర్మ మొదటి నుంచి చెబుతూ వస్తున్నారు.



## నాలుగో ఆర్థిక వ్యవస్థగా

# భారత్ నవోదయం!

### జపాన్‌ను అధిగమించి ముున్ముందుకు

### ప్రభుత్వ పటిష్టమైన విధానాలకు లభించిన అరుదైన గౌరవం

**భారతదేశం ఆర్థిక ప్రగతిలో మరో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి  తాజా అంచనాల ప్రకారం,  భారతదేశం 2025లో $4.187 ట్రిలియన్ జీడీపీతో జపాన్ను అధిగమించి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది.  ఐఎంఎఫ్ ఏప్రిల్ 2025 వరల్డ్ ఎకనామిక్ ఔట్లుక్ ప్రకారం, భారత జీడీపీ $4.187 ట్రిలియన్ కాగా, జపాన్ జీడీపీ $4.186 ట్రిలియన్గా ఉంది. ఇది భారతదేశ ఆర్థిక ప్రస్థానంలో కీలక ఘట్టం. 2024లో భారత్ ఐదవ స్థానంలో ఉండగా, జపాన్ నాలుగవ స్థానంలో ఉంది. ఏడాది వ్యవధిలోనే భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా అభివృద్ధి చెందింది. భవిష్యత్తులో, భారతదేశం జర్మనీ, జపాన్లను పూర్తిగా అధిగమించే అవకాశం ఉందని ఐఎంఎఫ్  చెబుతోంది. 2030 నాటికి భారత జీడీపీ $6.8 ట్రిలియన్ను చేరి, జర్మనీ కంటే 20% ఎక్కువగా, జపాన్ కంటే 33% అధికంగా ఉండనుంది.  ఇప్పటికే 2020లో బ్రిటన్ను అధిగమించిన భారత్, అంతర్జాతీయ ఆర్థిక శక్తిగా ఎదుగుతూ, ప్రపంచ ఆర్థిక రంగంలో తన స్థానం బలపరచుకుంటూ వస్తోంది. భారతదేశం సాధించిన ఈ విజయాన్ని చూసి, ప్రపంచం భారత్ను గణనీయమైన ఆర్థిక శక్తిగా అంగీకరిస్తోంది.  దేశీయ స్థాయిలో జరిగిన అభివృద్ధి మార్పులు, ప్రజల పొదుపు దృష్టి, యువత ఆధారిత జనాభా ఈ వృద్ధికి బలమైన ఆధారాలు. ఇది భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక గొప్ప ఘట్టం. మరిన్ని వివరాలలోకి వెళితే...**

ప్రపంచ ఆర్థిక చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఒక మైలురాయిని మనం దాటాం. మే 2025 నాటికే, మనదేశం జపాన్ను అధిగమించి, ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది! ఇది కేవలం ఒక అంకె కాదు, మన దేశ ప్రగతికి, మన ప్రజల నిరంతర కృషికి, మోదీ ప్రభుత్వ పటిష్టమైన విధానాలకు లభించిన అరుదైన గౌరవం. నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం స్వయంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి  డేటాను ఉటంకిస్తూ ఈ శుభవార్తను తెలియజేశారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థల జాబితాను చూస్తే, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, చైనా, జర్మనీ తర్వాత మన భారతదేశం నాలుగో స్థానంలో నిలబడటం నిజంగా గర్వకారణం. గతంలో ఐదో స్థానంలో ఉన్న మనం, సుమారు %వి%4.19 లక్షల కోట్ల డాలర్లు (సుమారుగా ₹35,600 కోట్ల రూపాయలు) నుంచి 4.39 లక్షల కోట్ల డాలర్ల స్థూల జాతీయోత్పత్తి  తో జపాన్ను వెనక్కి నెట్టగలిగాం. ఈ పరిణామం మన దేశం ఎంత వేగంగా పురోగమిస్తోందో, ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎంత బలంగా ఎదుగుతోందో స్పష్టం చేస్తోంది.

**ఈ విజయం వెనుక ఉన్న ప్రస్థానం: మలుపులు, మార్పులు:**
స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, మన భారతదేశం వ్యవసాయ ఆధారిత, తక్కువ ఆదాయ ఆర్థిక వ్యవస్థగా ఉండేది. ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాబల్యం, 'లైసెన్స్ రాజ్' వంటివి తొలి దశాబ్దాల్లో వృద్ధిని కొంత పరిమితం చేశాయి. అయితే, ముఖ్యంగా గత దశాబ్దంలో మనం స్థిరంగా అధిక వృద్ధి రేట్లను నమోదు చేస్తూ వచ్చాం. ఈ అద్భుతమైన ఆర్థిక వృద్ధికి అనేక అంశాలు దోహదపడ్డాయి. వాటిని కాస్త లోతుగా పరిశీలిద్దాం.

**సేవల రంగం: ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక బీ** మన దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచింది సేవల రంగం. సమాచార సాంకేతికత , ఐటీ ఆధారిత సేవలు, ఆర్థిక సేవలు, టెలికమ్యూనికేషన్స్ వంటివి అద్భుతమైన వృద్ధిని నమోదు చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా మన ఐటీ నిపుణులు తమ సత్తా చాటుతున్నారు. అంతేకాదు, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్  వంటి ఆవిష్కరణలతో డిజిటల్ చెల్లింపులలో మనం ప్రపంచ నాయకులుగా మారాం. ఫిన్టెక్ స్టార్టప్లు, సరసమైన డేటా ధరలు, విస్తృతమైన మొబైల్ నెట్వర్క్ ఇవన్నీ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదిని వేశాయి. పర్యాటకం, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి ఇతర సేవలు కూడా గణనీయంగా పుంజుకుంటున్నాయి.

**జనాభా ప్రయోజనం, పెట్టుబడుల ఆకర్షణ:**
140 కోట్లకు పైగా జనాభా, పెరుగుతున్న పట్టణీకరణ, అధికమవుతున్న ఆదాయాలతో, భారతదేశం ఒక పెద్ద వినియోగ మార్కెట్గా ఆవిర్భవించింది. మన దేశ జనాభాలో ఎక్కువ భాగం యువతే కావడంతో, వారి ఆకాంక్షలు, వినియోగపు అలవాట్లు ఆర్థిక వృద్ధిని నడిపిస్తున్నాయి. ఇది మన దేశానికి లభించిన జనాభా ప్రయోజనం. స్థిరమైన ఆర్థిక వాతావరణం, ప్రభుత్వ సంస్కరణలు, ఇంత పెద్ద మార్కెట్ కారణంగా భారతదేశం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నిరంతరం ఆకర్షిస్తోంది.

| సంవత్సరం | జిడిపి వృద్ధి శాతం | ఏటా మార్పు |
|---|---|---|
| 2013 | 6.39% | 0.93% |
| 2014 | 7.41% | 1.02% |
| 2015 | 8.00% | 0.59% |
| 2016 | 8.26% | 0.26% |
| 2017 | 6.80% | -1.46% |
| 2018 | 6.45% | -0.34% |
| 2019 | 3.74% | -2.72% |
| 2020 | -6.60% | -10.33% |
| 2021 | 8.68% | 15.28% |
| 2022 | 7% | 1.68% |
| 2023 | 8.2% | 1.2% |
| 2024 | 8.2% | 0% |

**మౌలిక సదుపాయాలు, డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్:**
రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు వంటి మౌలిక సదు-పాయాల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న భారీ వ్యయం ప్రైవేటు పెట్టుబడులకు కూడా అనుకూల వాతావరణం కల్పిస్తోంది. ఆధార్, డిజీలాకర్ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (ఇండియా స్టాక్) ఆర్థిక కార్యకలాపాలను సులభతరం చేసింది, పారదర్శకతను పెంచింది, ఆర్థిక చేరికను ప్రోత్సహించింది. గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం విస్తరిస్తుండటంతో డిజిటల్ సేవలకు డిమాండ్ పెరుగుతోంది.

**విధాన సంస్కరణలు, రాజకీయ స్థిరత్వం:**
వస్తు సేవల పన్ను పరోక్ష పన్నుల వ్యవస్థను ఏకీకృతం చేసి, "ఒకే దేశం, ఒకే మార్కెట్" లక్ష్యానికి దోహదపడింది. దివాలా స్మృతి వంటి సంస్కరణలు రుణ సంస్కృతిని మెరుగుపరిచాయి. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"లో మనం సాధించిన పురోగతి వ్యాపార ప్రక్రియలను సులభతరం చేసింది. గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న రాజకీయ స్థిరత్వం కూడా ఆర్థిక ప్రణాళికలు, సంస్కరణల అమలుకు ఎంతో తోడ్పడింది. ఈ అన్ని అంశాల సమ్మేళనమే మన భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక యవనికపై ఈ స్థాయిలో నిలబెట్టింది.

**భవిష్యత్ లక్ష్యం – జర్మనీని అధిగమించి, మూడో స్థానం వైపు:**
మన ప్రగతి ఇక్కడితో ఆగిపోదు! భారతదేశం రాబోయే 2.5 నుండి 3 సంవత్సరాలలో జర్మనీని అధిగమించి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం, భారతదేశం రాబోయే సంవత్సరాల్లో కూడా ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని భావిస్తున్నారు. 2025లో 6.2%, 2026లో 6.3% వృద్ధి రేటును నమోదు చేయవచ్చని అంచనాలున్నాయి. జపాన్ ఆర్థిక వ్యవస్థ దశాబ్దాలుగా స్తబ్దుగా ఉండటం, వృద్ధాప్య జనాభా వంటి కారణాల వల్ల మనం దాన్ని అధిగమించగలిగాం. జర్మనీ ప్రధానంగా తయారీ, ఎగుమతులపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ. మన దేశీయ మార్కెట్ బలం, సేవల రంగం వృద్ధి, తయారీ రంగాన్ని బలోపేతం చేసుకోవడం ద్వారా మనం ఈ లక్ష్యాన్ని సాధించగలం.

**మూడో ర్యాంకు సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలు :**
నిస్సందేహంగా, ఈ ప్రగతి ప్రస్థానంలో భారతదేశం కొన్ని సవాళ్లను కూడా ఎదుర్కోవాల్సి ఉంది. వీటిని అధిగమించడం ద్వారానే మూడో ర్యాంకును సుస్థిరం చేసుకోగలం. ఆదాయ అసమానతలు, పేదరికం ఇప్పటికీ ముఖ్యమైన సమస్యలుగా ఉన్నాయి. ఆర్థిక వృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరడం ముఖ్యం. ముఖ్యంగా యువతలో నిరుద్యోగిత ఒక సవాలుగా మిగిలింది. పెరుగుతున్న శ్రామిక శక్తికి తగినన్ని నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగం ఇప్పటికీ తక్కువ ఉత్పాదకత, వాతావరణ మార్పుల ప్రభావం వంటి సమస్యలతో సతమతమవుతోంది. దీన్ని మరింత బలోపేతం చేయాలి. అభివృద్ధి జరుగుతున్నప్పటికీ, పెరుగుతున్న అవసరాలకు తగినట్లుగా మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాల్సి ఉంది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతూ, ద్రవ్యలోటును తగ్గించుకోవడం ఆర్థిక స్థిరత్వానికి కీలకం. అంతేకాకుండా, అధిక జీడీపీ వృద్ధి ఉన్నప్పటికీ, మానవ అభివృద్ధి సూచికలో భారతదేశం ర్యాంకు మెరుగుపడాల్సిన అవసరం ఉంది. విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలలో అసమానతలు కొనసాగుతున్నాయి. సమ్మిళిత వృద్ధి సాధించాలంటే ఈ సూచికలను మెరుగుపరచడం అత్యవసరం. ఆర్థిక వృద్ధి పర్యావరణానికి హాని కలిగించకుండా చూసుకోవడం, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లడం, వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడం వంటి పర్యావరణ పరిరక్షణ అంశాలు కూడా చాలా ముఖ్యం.

**వికసిత భారత్ లక్ష్యం వైపు ప్రయాణం:**
ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించడం నిస్సందేహంగా ఒక చారిత్రాత్మక ఘట్టం. ఇది దేశం అపారమైన సామర్థ్యానికి, మన ప్రజల అకుంఠిత కృషికి, ప్రభుత్వ విధానాల సానుకూల ప్రభావానికి నిదర్శనం. ఆర్థికంగా బలపడటం ద్వారా, జి20, క్వాడ్, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై మన వాణి మరియు పలుకుబడి పెరుగుతోంది. "విశ్వగురు" పాత్ర పోషించే దిశగా మనం అడుగులు వేస్తున్నాం.
స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి "వికసిత భారత్" (అభివృద్ధి చెందిన దేశం) గా మారాలనేది మన లక్ష్యం. ఈ ప్రగతిని సమ్మిళితంగా, సుస్థిరంగా మార్చడం, ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా మాత్రమే భారతదేశం తన పూర్తి సామర్థ్యాన్ని ఆవిష్కరించి, ప్రపంచ యవనికపై ఒక అగ్రగామి శక్తిగా నిలదొక్కుకోగలదు. మనం ఈ సవాళ్లను అధిగమించి, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని ఆశిద్దాం. ఇది మనందరి కల, మనందరి కృషి.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

### పలు దేశాల జివిపి వృద్ధి ఇలా

**యునైటెడ్ స్టేట్స్:  $ 30.51 ట్రిలియన్ల జివిపి.**
**చైనా: $ 19.23 ట్రిలియన్ల జివిపి.**
**జర్మనీ: $ 4.74 ట్రిలియన్ల జివిపి.**
**భారతదేశం: $ 4.19 ట్రిలియన్ల జివిపి.**
**జపాన్:  $ 4.19 ట్రిలియన్ల జివిపి.**
**యునైటెడ్ కింగ్‌డమ్: $ 3.84 ట్రిలియన్ల జివిపి.**
**ఫ్రాన్స్: $ 3.21 ట్రిలియన్ల జివిపి.**
**ఇటలీ: $ 2.42 ట్రిలియన్ల జివిపి.**
**కెనడా:  $ 2.23 ట్రిలియన్ల జివిపి.**
**బ్రెజిల్: $ 2.13 ట్రిలియన్ల జివిపి.**



### తయారీ, వ్యవసాయ రంగాలు - నూతన ఉత్తేజం

కేవలం సేవల రంగానికే పరిమితం కాకుండా, "మేక్ ఇన్ ఇండియా", "ఆత్మనిర్భర్ భారత్" వంటి కార్యక్రమాలు దేశీయ తయారీని ప్రోత్సహిస్తున్నాయి. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు మొబైల్ ఫోన్లు, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి కీలక రంగాలలో దేశీయ ఉత్పత్తిని గణనీయంగా పెంచాయి. ఇది దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా, భారతదేశాన్ని ప్రపంచ సరఫరా గొలుసులో ఒక ముఖ్యమైన భాగంగా మార్చుతోంది. ఇప్పటికీ మన జనాభాలో అధిక భాగం వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. దేశ ఆహార భద్రతకు ఈ రంగం కీలకం. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, మెరుగైన నీటిపారుదల, పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ వృద్ధికి కూడా అపారమైన అవకాశాలున్నాయి.



సూర్య
విజయవాడ
మంగళవారం
27 మే 2025

suryachitramagazine@gmail.com
సూర్య సినిమా

## షష్టిపూర్తి లాంటి చిత్రాలను డైరెక్ట్ చేయడం కంటే

# ప్రొడ్యూస్ చేయడం చాలా కష్టం

**- దర్శకుడు పవన్ ప్రభ**



డా. రాజేంద్ర ప్రసాద్, నటి అర్చన ప్రధాన పాత్రల్లో రూపేశ్ హీరోగా, నిర్మాతగా మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై పవన్ ప్రభ తెరకెక్కించిన చిత్రం షష్టిపూర్తి. ఈ మూవీలో ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రను పోషించారు. ఈ సినిమాను మే 30న విడుదల చేయబోతోన్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న క్రమంలో దర్శకుడు పవన్ ప్రభ షష్టిపూర్తి గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులివే..

నేను హోటల్ మేనేజ్మెంట్ చేశాను. మా ఇంట్లో అంతా ట్రెడిషనల్ సింగర్సే ఉంటారు. నాకు చిన్నతనం నుంచే సినిమాలపై మక్కువ ఏర్పడింది. సినిమాలతోనే మనం మంచిని చెప్పగలమని నమ్ముతాను. అలా నేను చివరకు ఇండస్ట్రీలోకి వచ్చాను. ఫిట్టింగ్ మాస్టర్ సినిమాకు డైరెక్షన్ టీంలో పని చేశాను. ఆ సినిమాలో ఓ చోట, ఓ చిన్న సీన్లో కూడా నేను కనిపిస్తాను.

సినిమా విషయంలో నాకు చాలా గ్యాప్ వచ్చింది. ఇన్నేళ్లలో సినిమా అంటే ఏంటో ఇంకా నేర్చుకున్నాను. నేను ఈ షష్టిపూర్తి గురించి చాలా చోట్ల తిరిగాను. ఇళయరాజా గారు కావాల్సిందే అని ముందు నుంచీ ఫిక్స్ అయ్యాను. ఇళయరాజా గారు ఎలా వస్తారు? అని చాలా మంది అంటుండేవారు. ఫ్యామిలీ డ్రామాకు ఎక్కువ క్యాస్టింగ్ కావాల్సి ఉంటుంది. ఇలాంటి చిత్రాలకు డేట్లు అడ్జస్ట్ అవ్వాలి.. షూటింగ్కి టైం పడుతుంది. కానీ నేను ఈ సినిమానే చేయాలని ఫిక్స్ అయ్యాను. అందుకే ఇన్నేళ్లు పట్టింది.

మాది చాలా పెద్ద ఉమ్మడి కుటుంబం. నాకు అందరి ప్రేమ తెలుసు. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, పిన్నమ్మ, పెద్దమ్మ, మేనత్త ఇలా అందరి మధ్య పెరిగాను. కానీ ఇప్పుడు కొందరికి అమ్మానాన్నలు కూడా బరువు అవుతున్నారు. నడి రోడ్డు మీద వారిని వదిలేస్తున్నారు. అమ్మానాన్నల గొప్పదనాన్ని, ప్రేమ విలువను చెప్పాలనే ఉద్దేశంతోనే షష్టిపూర్తిని తీశాను. ఇప్పటి వరకు షష్టిపూర్తి గురించి చూసిన దాని కంటే మే 30వ తేదీని మీరు సర్ ప్రైజ్ అయ్యే అంశాలెన్నో సినిమాలో ఉంటాయి.

## పవన్ సినిమా ఆపే ధైర్యం

# ఎవరికీ లేదు

**● ఆ నలుగురిలో నేనూ లేను ● థియోటర్ల బంద్ అనేది తప్పుగా మారింది ● నిర్మాత దిల్ రాజు**



తెలుగు సినీ ఇండస్ట్రీలో జరుగుతు ఆ నలుగురి ప్రచారంలో తాను కూడా లేనని ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. సినీ ఇండస్ట్రీలో ఆ నలుగురు విలన్లు అంటూ ప్రస్తావించారు. తాను అంతా సింగిల్ అని, సోలోగా ఉంటున్నానన్నారు. తాను ఇప్పుడు చాలా ఎత్తుకు ఎదిగానని, తాను కేవలం తెలుగు మాత్రమే కాకుండా.. హైరేంజ్కు వెళ్తున్నాన్నారు. ఇక, రాష్ట్రంలో సినిమా థియోటర్లు మూసివేసే పరిస్థితులు ఉన్నాయని, ఇప్పటికిప్పుడు 50 థియోటర్లు మూసివేసేందుకు సిద్ధంగా ఉంటే తామే వారికి సర్ధి చెప్పి థియోటర్లు నడిపిస్తున్నట్లు చెప్పారు. నైజాంలో మొత్తం 370 సింగిల్ థియేటర్లు ఉంటే, ఎస్వీసీఎస్, తమకు సంబంధించినవి కేవలం 30 మాత్రమే ఉన్నాయని నిర్మాత దిల్రాజు అన్నారు. థియోటర్లు బంద్ అనే విషయంలో క్లారిటీ లేదని, ఈస్ట్ లో జరిగిన ఓ ఉదంతాన్ని అంతటికీ ఆపాదించారని, అంతేకానీ, థియోటర్లు బంద్ అనడం తప్పన్నారు. ప్రస్తుతం అసలైన విషయం పక్కదారి పట్టకుండా వివాదాస్పద ప్రశ్నలకు తావులేకుండా కొనసాగించాలని, పర్సంటేజ్ల విషయంలో ఎగ్జిబిటర్లకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఏప్రిల్లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కొందరు ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఈ అంశాన్ని మా దృష్టికి తీసుకొచ్చారు. వాళ్ల కష్టాలు మాకు తెలుసు. గత ఆరు నెలలుగా వస్తున్న రెవెన్యూ గురించి ఈ సందర్భంగా వారిని అడిగాం. పర్సంటేజ్ విధానం ఉంటే బాగుంటుందని వారు చెప్పారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో రెంట్ ఆర్ పర్సంటేజ్ విధానం నడుస్తోంది. మొదటి వారం బాగా రెవెన్యూ వస్తే, రెంట్ ఇస్తున్నాం. సెకండ్ వీక్ కలెక్షన్లు తగ్గగానే పర్సంటేజ్ ఇస్తున్నా. అది వాళ్లకు కష్టమైనదే. అది మా అందరికీ తెలుసు. దీనిపై చర్చిస్తున్నాం. కానీ, ఓ కొలిక్కి రాలేదు అని అన్నారు. సరిగ్గా అదే సమయంలో హరి హర వీరమల్లు విడుదల తేదీని ప్రకటించారని, ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల అది వాయిదా పడిందని, తర్వాత డేట్ను వాళ్లు లాక్ చేయలేదని దిల్ రాజు అన్నారు. పర్సంటేజ్ సమస్య ఈస్ట్ గోదావరి నుంచి మొదలై నైజాంకు కూడా వచ్చిందని, నైజాంలో 370 సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉంటే, ఎస్వీసీఎస్ సహా మా వద్ద ఉన్న థియేటర్లు 30 మాత్రమే అని, ఏషియన్, సురేశ్ కంపెనీలో 90 ఉన్నాయని, 250 థియేటర్లు ఓనర్లు, వాళ్లకు సంబంధించిన వాళ్లు మాత్రమే నడుపుతున్నారని సెటైర్ వేశారు. ఆ నలుగురు అంటూ మీడియా ఇష్టం వచ్చినట్లు రాస్తోందని ఈ విషయంలో క్లారిటీ ఇస్తున్నానని, వ్యక్తిగతంగా దాడి చేస్తున్నారని అని దిల్ రాజు అగ్రహం వ్యక్తం చేశారు.

## సంక్రాంతి కానుకగా 'అనగనగా ఒక రాజు'



ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న వినోదభరిత చిత్రం 'అనగనగా ఒక రాజు' సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టనుంది. తనదైన ప్రత్యేక కామెడీ టైమింగ్ తో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న బ్లాక్ బస్టర్ మెషిన్ నవీన్ పొలిశెట్టి మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చిత్ర బృందం విడుదల చేసిన మోషన్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రంతో నవీన్ పొలిశెట్టి థియేటర్లలో నవ్వుల పండుగను తీసుకురాబోతున్నాడని మోషన్ పోస్టర్ తోనే అర్థమైంది.

తెలుగు సినీ అభిమానులు సంక్రాంతి పండుగను సినిమా పండుగలా భావిస్తుంటారు. ముఖ్యంగా సంక్రాంతి సమయంలో ఫ్యామిలీ ఎంటర్టైనర్ లకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ ఉంటుంది. ఈ క్రమంలోనే పండుగకి సరైన సినిమాగా 'అనగనగా ఒక రాజు' వచ్చే సంక్రాంతికి థియేటర్లలో అడుగుపెట్టనుంది. తెలుగు సినీ పరిశ్రమలో వరుస విజయాలతో దూసుకుపోతున్న మీనాక్షి చౌదరి 'అనగనగా ఒక రాజు'లో నవీన్ పొలిశెట్టికి జోడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రేక్షకులను సరికొత్త వినోదాన్ని అందించేలా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు.

## 'భైరవం' ఫైనల్ కట్ అదిరిపోయింది



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్తో ముందుకు దూసుకెల్తుతోంది. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతీలాల్ గాడా సమర్పిస్తున్నారు. ఈ సినిమా మే 30న సమ్మర్ సీజన్లో బిగ్గెస్ట్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈవెంట్ లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మీరందరూ కూడా మాకు మంచి హిట్ పడాలని కోరుకుంటున్నారు. అది మాకు తెలుస్తుంది. ఈ సినిమాల్లో పని చేసిన సాంకేతిక నిపుణులకు నటీనటులందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ఇరగదీశారు. మే 30న మీరందరూ సినిమా చూసి మా టీమ్ అందరిని బ్లెస్స్ చేయాలి అని కోరుకుంటున్నాను. సినిమా మీ అందరికీ ఒక అద్భుతమైన ఎక్స్పీరియన్స్ ఇస్తుంది. ఒక మంచి సినిమా చూసామనే సాటిస్ఫాక్షన్ ఉంటుంది.

ఈ సినిమా కోసం మేము చాలా కష్టపడి ఇష్టపడి మీ అందరికీ ఒక మంచి సినిమా ఇవ్వాలని ఇవ్వాలని ఉద్దేశంతో చేసాం. డైరెక్టర్ విజయ గారు సినిమాని చాలా కష్టపడి తీశారు. ఆయన హార్డ్ వర్క్ ప్రతి ఫ్రేమ్ లో కనిపిస్తుంది. ఈ సినిమా ఫైనల్ కట్ చూశాను. అదిరిపోయింది. మామూలుగా ఉండదు. మే 30న మనందరికి పెద్ద పండగ. ఆ పండగలో మీరందరూ భాగం కావాలని కోరుకుంటున్నాను. సక్సెస్ మీట్లో మాట్లాడుకుందాం. లవ్ యు ఆల్'అన్నారు.

## అడివి శేష్ పాన్-ఇండియన్ థ్రిల్లర్ డకాయిట్



అడివి శేష్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియన్ థ్రిల్లర్ డకాయిట్ ఫైర్ గ్లింప్స్ తెలుగ, హిందీలో రిలీజ్ అయ్యింది. ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్ తో ఫైర్ గ్లింప్స్ అదిరిపోయింది. శేష్, మృణాల్ ఠాకూర్ మధ్య ఉద్రిక్త క్షణంలో గ్లింప్స్ ప్రారంభమౌతోంది. సానుభూతితో నిండిన వాయిస్ లో శేష్ ఆమెను జూలియట్ అని పిలుస్తాడు, అందరూ ఆమెకు అన్యాయం చేశారని చెబుతాడు. కానీ వెంటనే అతని వాయిస్ మారుతుంది. నేను నిన్ను మోసగించడానికి రాలేదు, అంతకంటే ఎక్కువ చేస్తా అని మిస్టీరియస్ స్మైల్ తో శేష్ చెప్పే డైలాగ్ అదిరిపోయింది. నెక్స్ట ఎపిసోడ్, ఖైదీ యూనిఫాం లో జైలు వ్యాన్ లో వున్న శేష్ కూల్ గా తన నోటి నుండి ఒక కీని బయటకు తెస్తాడు. తర్వాత ఓ రైలు వ్యాన్ మీదుగా దూసుకెళ్తుంది. చివరి సన్నివేశంలో, మృణాల్ అతని పక్కన కూర్చుంటుంది, శేష్ ఫైరింగ్ చేస్తాడు. ప్రేమ, ప్రతీకారం, మోసంతో నిండిన ఓ గొప్ప కథకు ఇది నాంది. విజువల్ గా డకాయిట్ ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్మార్క్ను సెట్ చేసింది. అడివి శేష్ ఇంటెన్స్ అండ్ రగ్గడ్ పాత్ర కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు. మదనపల్లె యాసలో అదరగొట్టాడు. అతని వాయిస్ మాడ్యులేషన్, ఎక్స్ ప్రెషన్స్ అద్భుతంగా వున్నాయి. హిందీ వెర్షన్కు కూడా తనే డబ్బింగ్ చెప్పారు. అది అద్భుతంగా వచ్చింది.

## 'గ్యాంబ్లర్స్' టీజర్ విడుదల



మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో కథానాయకుడిగా అందరి హృదయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాందించుకున్న యూత్ఫుల్ క్రేజీ హీరో సంగీత్ శోభన్ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కేసీఆర్ ఫేమ్ రాకింగ్ రాకేష్ పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత, , జస్విక, భరణి శంకర్, మల్హోత్ర శివ, శివారెడ్డి ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో శ్రీవల్లి అనే సైన్స్ ఫిక్షన్ సినిమాను నిర్మించిన నిర్మాతలు సునీత, రాజ్కుమార్ బృందావనంలు ఈ సినిమాను ఠ్మేస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్టైన్ మెంట్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేఎస్కే చైతన్య ఈ చిత్రానికి దర్శకుడు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్చేస్తున్నారు. కాగా ఈ చిత్రం టీజర్ ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ " ఇదొక మిస్టరీ ఎంటర్టైనర్. ఈ చిత్రంలో కొత్త సంగీత్ శోభన్ను చూడబోతున్నారు. ఆయన నటనలోని మరో కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. చిత్రంలో ఉండే థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్టు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి. పూర్తి వైవిధ్యమైన కాన్సెప్టో రూపొందుతున్న ఈ చిత్రంలో అన్ని వర్గాలను అలరించే అంశాలున్నాయి. ఇటీవల కేసీఆర్ చిత్రంతో అందరి ప్రశంసలు అందుకున్న రాకింగ్ రాకేష్ ఈ చిత్రంలో ఓ ముఖ్యపాత్రను పోషిస్తున్నాడు. ఆయన పాత్ర కూడా అందర్ని అలరించే విధంగా ఉంది అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ " మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో సంగీత్ శోభన్కు యూత్లు ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన గత చిత్రాలకు పూర్తి భిన్నమైన పాత్రను ఆయన ఇందులో చేస్తున్నారు. కొత్తకాన్సెప్టో పూర్తి థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన ఈ గ్యాంబ్లర్స్ తప్పకుండా అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు.

## పాన్ ఇండియా ఫిల్మ్ 'మిరాయ్' టీజర్



సూపర్ హీరో తేజ సజ్జా సూపర్ యోధగా తన అడ్వంచరస్ యాక్టింగ్ తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు, మే 28న తన మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మిరాయ్' టీజర్ విడుదల కానుంది. ఈ గ్లింప్స్ ఖచ్చితంగా గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందిస్తుంది, ప్రేక్షకులను సినిమా కోసం క్రియేట్ చేసిన కొత్త ప్రపంచంలోకి తీసుకువెళుతుంది. ఈ ఎక్స్ ట్రార్డినరీ టీజర్ చూడటానికి మరో రెండు రోజులు వేచి ఉండాలి. టీజర్ పోస్టర్ తేజ సజ్జా చేతిలో మంత్రదండం పట్టుకుని నడుస్తున్న రైలు పైన నిలబడి, రిస్కీ స్టంట్ చేస్తూ క్యారెక్టర్ బోల్డ్ నేచర్ ని ప్రజెంట్ చేస్తోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ యాక్షన్-అడ్వెంచర్ ముంబైలోని చారిత్రాత్మక గుహలలో కొత్త షూటింగ్ షెడ్యూల్ జరుగుతోంది. తేజ సజ్జాతో పాటు, కొంతమంది ప్రధాన తారాగణం ఈ తాజా షెడ్యూల్లో పాల్గొంటున్నారు. ఈ సినిమాలో సూపర్ యోధ పాత్ర పోషించడం ద్వారా తేజ సజ్జా అద్భుతంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమాలో రాకింగ్ స్టార్ మనోజ్ మంచు విలన్ నటించగా, రితికా నాయక్ కథానాయికగా నటించింది.

## కిల్లర్ నుంచి హీరోయిన్ జ్యోతి పూర్వజ్



శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్ వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ కిల్లర్ అనే సెన్సేషనల్ సై-ఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా పాత్రలో నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్ గా నటిస్తుండగా...విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏయు అండ్ఐ మరియు మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్ లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. కిల్లర్ మూవీ నుంచి హీరోయిన్ జ్యోతి పూర్వజ్ నటించిన 'రక్తిక' క్యారెక్టర్ లుక్ రిలీజ్ చేశారు. ఈ పాత్రలో ఆమె వ్యాంపైర్ లుక్ లో ఆకట్టుకుంటోంది.

ఇప్పటికే కిల్లర్ మూవీ నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది.

## పవన్ కల్యాణ్ సినిమాపై పేర్ని నాని కుట్ర : నట్టి కుమార్



పవర్ స్టార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై కక్షతో ఆయన నటించిన సినిమాపై వైసీపీ నాయకుడు, మాజీ సినిమాటోగ్రఫీ శాఖామంత్రి పేర్ని నాని కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ నట్టి కుమార్ ఆరోపించారు. పవన్ కల్యాణ్ నటించిన తాజా చిత్రం హరిహర వీరమల్లు విడుదలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఇంకా సెన్సార్ జరుపుకోలేదు, థియేటర్లలో విడుదల కాలేదు. అలాంటప్పుడు పేర్ని నాని ఆ సినిమాను ఫ్లాప్ సినిమా అంటూ ఎలా కామెంట్స్ చేస్తారు. ఒక సినిమా పూర్తి కావాలంటే ఎంతో మంది కళాకారుల, సాంకేతిక నిపుణుల శ్రమ, క్రియేటివిటీ అందులో దాగి ఉంటుంది. నిర్మాత కోట్లాది రూపాయల బడ్జెట్ ను వెచ్చించడం జరుగుతుంది. అయితే పేర్ని నాని మాత్రం కేవలం కుట్ర, కక్ష పూరితంగా సినిమాను డేమేజ్ చేస్తున్నారు. ఒక సినిమాను రిలీజ్ కాకముందు కామెంట్స్ చేసే రైట్స్ ఆయనకు ఎవరు ఇచ్చారు?. దీనిపై చిత్ర నిర్మాత ఎ.ఎం.రత్నం కేసు పెట్టాలి. ఇకపై విడుదల కాబోతున్న సినిమాపై పేర్ని నాని లాగా ఇంకెవరూ విష ప్రచారం చేయకుండా తెలుగు ఫిలిం ఛాంబర్, తెలుగు నిర్మాతల మండలి తీవ్రంగా ఖండించాలి. ఈ కుట్రపై ప్రభుత్వం తగిన విచారణ జరిపి, పేర్ని నానిపై కఠిన చర్యలు చేపట్టాలి అని నట్టి కుమార్ డిమాండ్ చేశారు.

## టొవినో థామస్ నరివెట్టకు మంచి రెస్పాన్స్



మలయాళ హీర టొవినో థామస్ నటించిన లేటెస్ట్ కాప్ యాక్షన్ డ్రామా చిత్రం నరివెట్ట మలయాళం లో విడుదలై మంచి విజయం సాధించింది, టొవినో నటనకు ప్రసంశలు వస్తున్నాయి. మలయాళంలో మంచి ఫాలోయింగ్ ఉన్న ఈ హీరోకు తెలుగులోనూ మంచి గుర్తింపు దక్కింది. త్వరలో నరివెట్టను తెలుగులో రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. వేసవి కానుకగా మే 23న ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఇక తెలుగులో ఈ చిత్రాన్ని ప్రముఖ సంస్థ మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్స్ వారు గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ మేరకు అధికారికంగా వారు ప్రకటించారు. ఇటీవల ఐడెంటిటీ 'ఏఆర్ఎమ్' మూవీస్ లో టొవినో తన పాత్రతో ప్రేక్షకుల్లో మంచి ఇమేజ్ దక్కించుకున్నాడు. ఇప్పుడు ఇలా పోలీస్ స్టోరీ చిత్రంతో వస్తుండటంతో ఈ సినిమాపై కూడా తెలుగు ప్రేక్షకుల్లో బజ్ క్రియేట్ అవుతుంది. ఇక ఈ సినిమాను అనురాజ్ మనోహర్ డైరెక్ట్ చేస్తుండగా అబిన్ జోసెఫ్ ప్రొడ్యూస్ చేశారు. ఈ సినిమాలో సురాజ్ వెంజరమూడు, చెరణ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా జేక్స్ బిజోయ్ సంగీతం అందించాడు.

## యూత్ ని ఫిదా చేస్తున్న 'వర్జిన్ బాయ్స్' సాంగ్




త్వరలో విడుదల కానున్న వర్జిన్ బాయ్స్ సినిమా ఆసక్తి రేవుతుంది. ఇటీవల విడుదలైన టీజర్ ఎంతగానో ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ సినిమాలోని పెదవుల తడి పాట విడుదల అయ్యింది. ఇది యువత హృదయాలను కట్టిపడేసేలా ఉంది.

పూర్ణ చారి రాసిన లిరిక్స్ చాలా బాగున్నాయి. ఆదిత్య ఆర్ కె గొంతులోని మాయాజాలం పాటకు ప్రాణం పోసింది. అతని గాత్రంలోని భావోద్వేగం, యువతీయువకుల ప్రేమ ఊహలను పట్టిస్తూ, పాటను మరింత ఆకర్షణీయంగా చేసింది. స్మరణ్ సాయి సంగీతం ఈ పాటకు యవ్వన శక్తిని, శృంగార హంగ్ను జోడించింది. వెంకట ప్రసాద్ సినిమాటోగ్రఫీ పాటను అందంగా మలిచింది. నటీనటుల కెమిస్ట్రీ స్క్రీన్పై చక్కని రొమాంటిక్ వైబ్ను సృష్టించింది. ఈ పాట యువత ఆలోచనలు, భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ, సినిమా యొక్క రొమాంటిక్ కామెడీ సెంటిమెంటల్ జోనర్కు సరిగ్గా సరిపోయింది. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ పాటకు స్ఫురణను, లయను అందించి, ప్రతి ఫ్రేమ్ను ఆకర్షణీయంగా మలిచింది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044